మహిళా వైద్య సిబ్బందితో తొలి ఆపరేషన్ థియేటర్

హైదరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బంజారాహిల్స్‌లోని ఆసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆసుపత్రిలో మహిళా వైద్య సిబ్బందితో నిర్వహించే ఆల్ ఉమెన్ ఆపరేషన్ థియేటర్(ఓటీ) అయిన సెంటర్ ఫర్ ఫంక్షనల్ అండ్ ఫిమేల్ యూరాలజీ కేంద్రాన్ని ఐపీఎస్ అధికారి, టీజీసీ ఎస్‌బి డైరక్టర్ శిఖాగోయల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రి తీసు కున్న నిర్ణయం మహిళల ఆరోగ్య సాధికరత దిశ గా తీసుకొన్న వినూత్న నిర్ణయమని అభినందించారు.

మహిళలు తమ ఆనారోగ్య సమస్యల విషయంలో ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలని, తద్వారా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. చాలా మంది అనుమానాలతో, సంకుచిత త్వంతో వైద్యుల వద్దకు వెళ్లరని, అలాంటి ఆలోచనలను మానుకోవాలని సూచించారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్య కరంగా ఉంటుందన్నారు. మహిళల్లో మూత్ర అసంయమనం, పెల్విక్ ఆర్గన్ ప్రోలాప్స్, పునరా వృత మూత్ర మార్గ ఇన్ఫెక్షన్లు, మూత్రాశయ నొప్పి వంటి సమస్యలు అధికంగా కనిపిస్తున్న ప్పటికీ, సామాజిక సంకోచం, అవగాహన లోపం కారణంగా చాలామంది చికి త్సకు ముందుకు రావడం లేదన్నారు. ఈ సమస్యలకు సమగ్ర నిర్ధార ణ, ఆధునిక చికిత్సలు ఒకే చోట అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ట్లు ఆసుపత్రి వైద్యు లు వివరించారు. ఈ కేంద్రంలో మూడు ముఖ్య విభా గాలు ఏర్పాటు చేశామని పూర్తిగా మహిళా వైద్యులు, అనస్థీషియా నిపుణులు, నర్సులు, సాంకేతిక నిపుణులతో పనిచేసే ప్రత్యేక ఆపరేషన్ థియేటర్, శస్త్రచికిత్స అవసరం లేకుండా పెల్విక్ కండరాల బలపరిచే పునరావాస కార్య క్రమం, మూత్రాశయ పనితీరును అంచనా వేసే యూ రోడైనమిక్ పరీక్షల సదుపాయం అందుబాటులో ఉంచామన్నారు. గత ఐదేళ్లలో ఏఐఎన్‌యూ మ హిళా యూరా లజీ బృందం 307 ప్రధాన శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. మూత్ర లీకేజ్, యూరినరీ ఫిస్టులాలు, సిస్టోసీల్స్, ఫీమేల్ యూరేథ్రోప్లాస్టీ వంటి క్లిష్ట సమస్యలకు చికిత్స అందిం చిన అనుభవంతోనే ఈ ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అంతా మొక్కుబడి

మదనంతాపూర్ వద్ద ఇసుక డంప్‌ను సీజ్ చేసిన పోలీసులు

అక్రమ ఇసుక తవ్వకాలపై తూతూ..మంత్రంగా దాడులు

కొద్దిపాటి నిల్వ ఉన్న మదనంతాపూర్ డంప్ సీజ్

రైల్వే గేటు సమీపంలో భారీగా నిల్వ ఉన్న డంప్‌ను వదిలేయడంపై విమర్శలు

పెద్దేముల్, మార్చి 5, ప్రభాతవార్త : ఇసుక అక్రమ రవాణాపై సంబందిత అధికారులు తూతూ మంత్రంగా దాడులు నిర్వహించారు. మదనంతాపూర్ వద్ద ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. గురువారం వార్త పత్రికలో ఇసుక తోడేళ్లు శీర్షికన కాగ్నానది నుంచి జేసిబిలతో తవ్వకాలు చేస్తున్న వైనంపై ప్రచురితమైన వార్త కథనానికి పోలీసు, రెవెన్యు అధికారులు ఎట్టకేలకు స్పందించారు. పెద్దేముల్ మండలంలోని మదనంతాపూర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో 8 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. అయితే బొంకురు సమీపంలోని రైల్వే గేటు వద్ద నిల్వ ఉంచిన భారీ ఇసుక డంపులను సీజ్ చేయకుండా వదిలేసారు. అటువైపు సంబందిత అధికారులు కన్నెత్తిచూడకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్కడ నిల్వ ఉంచిన ఇసుక డంపుల నుంచి ట్రాక్టర్ల ద్వారా రవాణా చేసి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. పట్టపగలే యదేచ్ఛగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న పట్టించుకునేవారే కరువయ్యారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైన జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు మంబాపూర్ చౌరాస్తాలో చెక్ పోస్టు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

99 రోజులూ.. టీమ్ వర్క్

నేటి నుంచి ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక

రంగారెడ్డి అర్బన్, మార్చి 5, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు నిర్వహించనున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు కె.చంద్రారెడ్డి,కె.శ్రీనివాస్‌లతో కలిసి జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు లబ్ధి చేకూర్చిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చేయడమే ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లా, మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులను భాగస్వాములుగా చేసి అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో టీమ్ వర్క్‌తో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో పరిశుభ్రత, ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అర్బన్-అర్బన్, సంక్షేమం, పిల్లల భద్రత, వ్యవసాయం, విద్య, యువత, క్రీడలు, మహిళలు, పర్యావరణం వంటి ప్రభుత్వ రంగాలకు సంబంధించిన పలు అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి థీమ్‌కు నోడల్ అధికారులను నియమించి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు. చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ఫొటోలు, వీడియోల రూపంలో డాక్యుమెంటేషన్ చేసి రోజువారీ నివేదికలు అందజేయాలని అధికారులకు సూచించారు. మార్చి 6 నుంచి 15 వరకు ..పరిశుభ్రత-ఫైళ్ల క్లియరెన్స్.. అనే థీమ్ అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో మార్చి 6న అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల పరిష్కారంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా చర్యలు సూచించారు.ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో చేపట్టే ప్రతి పని ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కె. శ్రీనివాస్, డీఆర్ఓ సంగీతం, జడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేశ్ మోహన్, సిపిఓ సౌమ్య, పీడీ డీఆర్డీఏ శ్రీలత, వ్యవసాయ శాఖ అధికారి ఉషా, పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత, మేనేజర్ హరీష్, మిషన్ భగీరథ, ఆర్ అండ్ బి, సంక్షేమ శాఖ అధికారులు రామారావు, నవీన్ కుమార్ రెడ్డి, కేషురామ్, రామవేశ్వరి దేవి,పద్మావతి తదితరులు పాల్గొన్నారు

ప్రతి థీమ్‌కు నోడల్ అధికారుల నియామకం

అన్ని స్థాయిల్లో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం

ప్రతిపని ప్రజలకు స్పష్టంగా కనిపించాలి

ప్రతి కార్యక్రమానికీ ఫొటోలు, వీడియోల రూపంలో డాక్యుమెంటేషన్

రోజువారీ నివేదికలు తప్పనిసరి

అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు

అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

కొత్వాల్ గూడలో గుట్టల తవ్వకాల కోసం నిర్మించిన క్రిషర్ మిషన్ ప్లాంట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కొత్వాల్‌గూడ గుట్టలన్నీ..

కొల్లగొట్టేస్తున్నారు

అసైన్డ్ భూములలో క్రషర్ మిషన్, రెడీమిక్స్ ప్లాంట్లా!

అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా నిర్మాణం

రెవెన్యూ, మైనింగ్, పొల్యూషన్ అధికారులు ఏం చేస్తున్నారు

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బిఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్ ధ్వజం

రంగారెడ్డి అర్బన్, మార్చి5, ప్రభాత వార్త: కేజిఎఫ్ సినిమా తరహాలో కొత్వాల్ గూడలో గుట్టల దోపిడి జరుగుతోందని టిఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ కొత్వాల్ గూడలో ఉన్న క్రిషన్ మిషన్, రెడీమిక్స్ ప్లాంట్లపై బిఆర్ఎస్ పార్టీ నిజనిర్ధారణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం క్రిషర్ మిషన్ ప్లాంట్లను ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, కార్తీక్ రెడ్డి, శశాంక్, అభిషేక్, ఎర్రోళ్ల శ్రీనివాస్, అభిలాష్, కిషోర్ గౌడ్ ప్లాంట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. రాష్ట్రంలో క్రషర్ ప్లాంట్ పెట్టాలన్న, రెడీమిక్స్ ప్లాంట్ పెట్టాలన్న అనేక నియమ నిబంధనలు ఉన్నాయన్నారు. అవేమీ పట్టవని రీతిలో దొంగలు దొంగలు కలిసి ఊర్లు పంచుకునే విధంగా కొంతమంది అక్రమంగా సీలింగ్ భూములలో ఏర్పాటుచేసి నడుపుతున్నారని ఆరోపించారు. స్థానికులు కోర్టై కోస్తున్నా ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు మైనింగ్ అధికారులు ఇక్కడ వచ్చి చూసిన పాపన పోలేదన్నారు. క్రషర్ మిషన్లు, రెడీమిక్స్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలంటే దాదాపు 9 అనుమతులు తప్పనిసరి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అనుమతి లేకుండా నడిపిస్తున్న ప్లాంట్ల ద్వారా దాదాపు 200 కోట్ల వరకు అక్రమార్జన జరిగిం దన్నారు. ఈ భూములన్నీ అసైన్డ్ భూములు అని దళిత బిడ్డలకు గత ప్రభుత్వాలు వాళ్ళ జీవితాల్లో వెలుగులు రావాలా వాళ్ళ బతుకులు బాగుపడాలంటే వాళ్ళ బతుకులు లో బుగ్గి పాలు చేసే విధంగా భూములు గుంజుకొని అక్రమార్జన జరుపుతున్నారని ఆరోపించారు.

అనుమతి లేని క్రషర్ మిషన్లు, రెడీమిక్స్ ప్లాంట్లపై పొల్యూషన్ కాంట్రాక్ట్ బోర్డు, రెవెన్యూ అధికారులు, మైనింగ్ అధికారులు వెంటనే సంయుక్తంగా విచారణ జరపాలని, వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

వీటి నిర్వాహకులు ఎంతటి వారినైనా క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాజీ రాష్ట్ర సభ్యులు కొలను ప్రదీప్ రెడ్డి, మంచర్ల శ్రీనివాస్, కొనమొల శ్రీనివాస్, జయసింహ, మోహన్ రావు, చెక్కల చంద్రశేఖర్, రాజేందర్, వెంకట్ రెడ్డి, గుంటి చరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

200 రోజుల పనులు

రూ. 800 కూలీ ఇవ్వాల్సిందే

సిపిఎం నేతల డిమాండ్

ఇబ్రహీంపట్నం, మార్చి 5, ప్రభాతవార్త: పొద్దంతా కష్టపడితే చేతికి రూ.200 కూడా రావ డం లేదు.. అందులోనూ బస్సు చార్జీలకు, గడ్డ పార సానికే సగం పోతే ఇక ఇంటికి ఏం తీసు కెళ్తారు? భార్య పిల్లలను ఎలా సాదుకుంటారు? అంటూ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ.. పని ప్రదేశంలో తాగడానికి నీళ్లు, ఎండ నుంచి రక్షణ పొందేందుకు నీడ లేక పోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం గాయమైతే మందు బిళ్ళకూ దిక్కులేదా అంటూ అధికారులను నిలదీశారు. గతంలో ప్రభు త్వం ఇచ్చే తట్టలు, పారలు ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని ఆ యన ప్రశ్నించారు.

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పథకం ప్రకారం నిర్వీర్యం చేస్తోందని..చట్టం నుంచి మహాత్మా గాంధీ పేరు తీసేసి, బడ్జెట్ తగ్గించి పేదవాడి పొట్ట కొడుతోందని ఆయన విమర్శించారు. పీజీలు చేసిన నిరుద్యోగులు కూడా ఈ రోజు ఉపాధి పనులకు రావాల్సిన పరిస్థితి వచ్చిందంటే దేశంలో పాలన ఎలా ఉందో అర్థం చేసు కోవచ్చన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల ముందు మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పిందని దుయ్యబట్టారు.కూలీల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్లను ముట్టడిస్తామని వెస్లీ హెచ్చరించారు.

ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని, రోజువారీ కూలీని రూ.800కి పెంచాలని డిమాండ్ చేశారు. ముందుగా మండల కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తామని అప్పటికి ప్రభుత్వం దిగిరాకపోతే కలెక్టరేట్ల వద్దే వంటావార్పు చేపట్టి నిరసన తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, నేతలు సామెల్, జగదీష్, కందు కూరి జగన్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యకు పెద్దపీట

షాద్‌నగర్‌లో పాలిటెక్నిక్ భవనానికి రూ.29.70 కోట్లు: ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కళాశాల బృందం

షాద్‌నగర్, మార్చి 5, ప్రభాతవార్త : షాద్ నగర్ నియోజకవర్గంలో పాలిటెక్నిక్ డిప్లొమా స్థాయి సాంకేతిక విద్యను పెద్ద ఎత్తున అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.29.70 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వం ఉన్నత సాంకేతిక విలువలతో విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. లింగారెడ్డి గూడ వద్ద (అలీ సాబ్ గూడ) మూడు ఎకరాల భూమిని కూడా కళాశాల భవనాల కోసం కేటాయించిందని చెప్పారు. దాదాపు 250 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ప్రభుత్వ అత్యున్నత పాఠశాల నిర్మాణం కొండుర్గ్‌లో జరుగుతోందని వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణాన్ని కూడా పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు తెలిపారు. కోట్లది రూపాయలతో ఇండోర్ స్టేడియం అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. పేదవాళ్లకు నాణ్యమైన విద్య అందించాలన్న సంకల్పంతో కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖను పర్యవేక్షి స్తున్నారని.. దీనివల్ల సమాజంలో విద్యకు మంచి ప్రాధాన్యత లభిస్తుందని భరోసా ఇచ్చారు. పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేశామని గొప్పలు చెప్పుకున్న గత పాలకులు కనీసం స్థలం కూడా కేటాయించలేదన్నారు. తను ఎమ్మెల్యే అయ్యాక లింగారెడ్డి గూడ వద్ద మూడు ఎకరాల స్థలాన్ని పాలిటెక్నిక్ కళాశాలకు సమకూర్చే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలకు నిధులు మంజూరు అవ్వటానికి చేసిన కృషిని అభినందిస్తూ ఎమ్మెల్యేను ప్రిన్సిపల్ పరమేశ్వరరావు ఘనంగా సన్మానించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బస్వం, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీఖాన్ బాబర్, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, సీనియర్ నేత దంగు శ్రీనివాస్ యాదవ్, మహమ్మద్ ఇబ్రహీం, సయ్యద్ ఖదీర్, లింగారెడ్డి గూడ ఉపసర్పంచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇ-వేస్ట్ ఇస్తే ఆన్‌లైన్ షాపింగ్ వోచర్లు

హైదరాబాద్, మార్చి 5,ప్రభాతవార్త: నగరంలో పెరుగుతున్న ఇ-వేస్ట్ సమస్యపై బల్దియా ప్రత్యేక దృష్టి సారించింది. ఇళ్లలో, ఆఫీసుల్లో పేరుకుపోతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించేందుకు కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు ఉచితంగా ఇ-వేస్ట్ సేకరించిన జీహెచ్ఎంసీ ఇక నుంచి ప్రజలకు రిడీమేబుల్ కూపన్లు ఇచ్చి ఈవేస్ట్ తీసుకునే లా చర్యలు తీసుకుంటోంది. ప్రజలు ఇచ్చే ఇ-వేస్ట్ విలువ ఆధారంగా అమెజాన్, ఫ్లిప్ కార్ట్, మింత్రా లాంటి ఆన్లైన్ షాపింగ్ వౌచర్లు, కూపన్లు ఇవ్వనున్నారు.. ఆయా కూపన్ల వద్దు అనుకున్నవారికి యూపీఐ ద్వారా డబ్బులు కూడా వేయనున్నారు.

ఇక నుండి జీహెచ్ ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల పరిధిలో ప్రతి శని, ఆదివారాల్లో ప్రత్యేక ఇ-వేస్ట్ డ్రైవ్ నిర్వహించనున్నారు. కాలనీలకు వెళ్లి పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలను సేకరించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు.

11వందల పడకలు

రెండు వేల మంది రోగులు

రోగ నిర్ధారణ పరీక్షలకు అరకొర పరికరాలు

సిటీస్కాన్ చేయాలన్నా నాలుగైదు రోజుల సాగదీత

అత్యవసర పరిస్థితులు అయినా అంతే..

మార్చురీలో 35కు పైగా మూలపడిన ఫ్రీజర్‌లు

గాంధీ ఆసుపత్రిలో వైద్య సదుపాయాలపై బాధితుల ఆందోళన

(హైదరాబాద్-ప్రభాతవార్త)

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన స్పత్రులైన గాంధీ, ఉస్మానియా లాంటి ఆస్పత్రులలో రోజురోజుకు రోగుల సంఖ్య పెరిగిపోతోంది. ఇందుకు తగ్గట్టుగా మాత్రం సదుపాయాలు మెరుగుపడడం లే దు. గత కొంత కాలంగా ఈ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాలు కూడా అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం వచ్చే రోగులకు వైద్యులు వైద్య సేవలను విస్తరించాలని ప్రయత్నించినప్పటికి అందుకు అవసరమైన మేరకు వైద్య పరికరాలు అందుబాటులో ఉండ డం లేదని తెలుస్తోంది. వాతావరణ మార్పులతో వచ్చే రోగాలతో పాటు ఇతర రోగాలకు వైద్యసే వలు అందించగలిగే ఆస్పత్రులైన సికింద్రాబాద్ గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులలో చికిత్సలకు అ వసరమైన పరికరాలు అందుబాటులో లేని కార ణంగా సకాలంలో వైద్య సేవలను అందించలేక పోతున్నారు. అన్ని విభాగాలకు సరిపడా వైద్యులు లేనప్పటికి ఆస్పత్రిలో ఉన్న వైద్యుల తోనే కాలం నెట్టుకువస్తున్నారు. గాంధీ ఆస్పత్రి లో దాదాపు 11వందల పడకలు ఉండగా రోగుల సంఖ్య మాత్రం రెండువేలకు మించి ఉంటోంది. మరికొన్ని పడకలు అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం ఉన్నప్పటికి సరైన వైద్యులు అందు బాటులో లేని కారణంగా అలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది.

రోగ నిర్ధారణ పరీక్షలకు తప్పని తిప్పలు...

రోగికి చికిత్సలు చేయాలంటే అంతకంగే ముందుగా వైద్య పరీక్షలు జరిపించడం అవసరం. రోగిని వైద్యులు పరిక్షించిన అనంతరం వారికి సరైన చికిత్స అందించడం కోసం వైద్యులు రోగాలను నిర్ధారించుకోడాని ఎక్స్‌రేలు అంతకంటే ముఖ్య మైన పరీక్షలు జరిపించుకోవాల్సిందిగా సూచి స్తుంటారు. గాంధీ ఆస్పత్రిలో ఎక్స్‌రే యంత్రాలు కూడా సరిపడా లేకపోవడంతో తీసిన ఎక్స్‌రేలను ఫోన్‌లలో ఫోటోలు తీసుకువచ్చి రోగులే వైద్యు లకు చూపించి వైద్య సేవలు పొందుతున్నారు. కనీసం సిటీస్కాన్ చేయాలన్నా నాలుగైదు రోజు ల సమయం పడుతుందని రోగులు చెబుతున్నా రు. అత్యవసర పరిస్థితిలో వచ్చిన రోగికి రోగ నిర్ధారణ పరీక్షలు జరిపించుకోవాలంటే ప్రాణాల మిదికి వచ్చినంత పనవుతుందని రోగులు ఆరోపస్తున్నారు. నాలుగు రోజుల కిందట ఓ రోగికి అత్యవసరంగా సిటీస్కాన్ చేయాల్సి ఉండగా టెక్నీషియన్ రోజుల తరబడి సమయం తీసుకుం టుండడంతో రోగి బంధువులు ఆందోళనకు దిగా రు. అత్యవసర పరిస్థితిలో రోగ నిర్ధారణ పరీక్షల కు రోజుల సమయం తీసుకోవడం పట్ల మండిప డ్డారు. ఈ విషయంలో సూపరింటెండెం ట్ కల్పించుకొని అప్పటికప్పుడు సిటీస్కాన్ చే యించడంతో సమస్య పరిష్కారం అయ్యింది. ఇ లాంటి సంఘటనలు తరచుగా జరుగుతూనే ఉన్నాయి. నిత్యం రెండు వేల మంది రోగులు ఆశ్రహిస్తున్న ఆస్పత్రిలో సరైన వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవడం వల్ల రోగులకు తిప్ప లు తప్పడం లేదు. కొన్నిసార్లు రోగులు కూడా వైద్యులపై మండిపడుతున్నారు. రోగికి సంబం ధించిన రిపోర్టులు సకాలంలో రాకపోవడంతో వైద్యులు కూడా చికిత్సలు జరిపే అవకాశం ఉం డకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచు కోవడం లేదు. ఇందులో వైద్యుల నిర్లక్ష్యం లేకపో యినా సమస్యలు ఎదుర్కొంటున్నారు. చివరికి గాంధీ ఆస్పత్రి మార్చూరీలో ఫ్రీజర్‌లు కూడా అన్ని సక్రమంగా పనిచయడం లేదు. వాటిని గాంధీ ఆస్పత్రి ఏర్పాటు చేసినప్పుడు ఉన్నవే తప్ప మళ్ళి కొత్తవి ఏర్పాటు చేయడం లేదని చె బుతున్నారు. దాదాపు 70 ఫ్రిజర్‌లు ఉండగా వాటిలో సగం కంటే ఎక్కువే పని చేయడం లేద ని తెలుస్తోంది. ఆస్పత్రి వర్గాలు ప్రభుత్వానికి వీటి విషయమై లేక రాయగా వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ ఈ విషయమై సూప రింటెండెంట్‌ను ఆరా తీశారు. వెంటనే (టీజీ ఎంఎస్ఐడీసీ) తెలంగాణ వైద్య విద్యా మౌళిక సదుపాయాల కల్పన సంస్థ ఫ్రిజర్‌ల మంజూరు కు అనుమతించింది. దీంతో త్వరలోనే దాదాపు 40 ఫ్రిజర్‌లు కొత్తవి అందుబాటులోకి రానున్న ట్లు సమాచారం. ఇలా అత్యవసరమైతే తప్ప అస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలు, మిషనరీ అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.రోగులు ఆస్పత్రికి వస్తున్నారు, పోతున్నారు. కాని ఆస్పత్రిని ఆశ్రహించిన రోగులక స మస్యలు మాత్రం అంతంమాత్రంగా పరిష్కారం అవుతున్నాయని రోగులు చెబుతున్నారు.

సౌండ్ బాక్స్‌లను అందజేస్తున్న దాత జస్వంత్ భవీన్

పాఠశాలకు సౌండ్ బాక్స్ బహూకరణ

షాద్‌నగర్, మార్చి 5, ప్రభాతవార్త : ఫరూక్ నగర్ మండలం, రాయికల్ తాండ ప్రైమరీ స్కూల్‌కు మన్నవ నాగరాజు, జానకి పుత్రుడు మన్నవ జస్వంత్ భవీన్ జన్మదినాన్ని పురస్కరించుకొని కమ్మ సమైక్య వేదిక అధ్యక్షుడు మన్నవ సాంబశివరావు ఇంటెల్ సౌండ్ బాక్స్ ను స్కూలుకు బహూకరించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ ఆర్కే పతంజలి మరియు సర్పంచి రాజు నాయక్ దాతను శాలువాతో సన్మానించి, పిల్లలకు అవసరమైన సౌండ్ బాక్స్ బహుకరించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కమ్మ సమైక్య వేదిక అధ్యక్షులు మన్నవ సాంబశివరావు, మన్నవ జానకి, ఉపాధ్యక్షులు వైకుంఠ సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి మాకినేని వెంకట్ నారాయణ, హెడ్మాస్టర్ ఆర్కే పతంజలి, సర్పంచ్ రాజు నాయక్, టీచర్లు సరిత, నిర్మల వేదిక సభ్యులు శివ నాగేశ్వరరావు, నరేష్,రుత్విక పాల్గొన్నారు.

పెదవీడులో సోలార్ వీధిలైట్లను ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజ సులోచన

మౌలిక వసతుల కల్పనకు కృషి

షాబాద్, మార్చి 5, ప్రభాతవార్త : ప్రజలకు అనుగుణంగా గ్రామంలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పెదవీడు గ్రామ సర్పంచ్ చక్కటి రాజసులోచన అన్నారు. షాబాద్ మండల పరిధి లోని పెదవేడు గ్రామంలో గురువారం అమెజాన్ సంస్థ సహకారంతో సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో సిసి రోడ్లు, వీధి దీపాలు, అంతర్గత మురుగు కాలువలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా గ్రామంలో పచ్చదనం పరిశుభ్రతపై దృష్టి పెట్టా మన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా పూర్తి చేస్తా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకుడు చక్కటి దేవేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ రవీందర్ నాయక్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆవిష్కరణలో కవిత ప్రతిభ

దుద్యాల్, మార్చి 5, ప్రభాతవార్త : మండల పరిధిలోని హకీంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 6వ తరగతి విద్యార్థిని కవిత శాస్త్రీయ ఆవిష్కరణలో ప్రతిభ కనబరిచి ప్రతిష్ఠాత్మకమైన ఇన్స్పైర్ మ్యానక్ 2025- 26 పథకానికి ఎంపికైనట్లు ఎంఈవో శంకర్

తెలిపారు. కవిత సమర్పించిన సైన్స్ ఆలోచన జిల్లాస్థాయిలో ఎంపికై, రాష్ట్రస్థాయికి వెళ్లే అవకాశం పొందడం సంతోషకరమని ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. ఇన్స్పైర్ మ్యానక్ అవార్డు రావడం దుద్యాల్ మండలానికి గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా కవిత, ఆమె తల్లిదండ్రుల ు ఈ అవార్డు రావడానికి మార్గ నిర్దేశం చేసిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు అంజనాయక్ కి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో ముందుకు రావాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే పేదల జీవితాల్లో వెలుగు

మేడ్చల్, మార్చి. ప్రభాతవార్త : తెలంగాణలో ప్రజా పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల జీవితాల్లో వెలుగు నిండిందని మేడ్చల్ మాజీ కౌన్సిలర్ మణికంఠ గౌడ్ అన్నాడు. మేడ్చల్ పట్టణంలోని కిందిబస్తీలో సురోళ్ల ప్రశాంతి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లును మాజీ కౌన్సిలర్ గురువారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాటా్లడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఇవ్వలేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తున్నదని అన్నారు.

ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న మణికంఠ

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నదని తెలిపాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోనార్క్, సాయి, నవీన్, సాయిరాం, వినోద్, దాసు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనిరంజన మఠంలో ఆరాధనోత్సవాలు

కొడంగల్, మార్చి 5 ప్రభాతవార్త : కొడంగల్ పట్టణంలోని శ్రీనిరంజన మఠంలో ఆరాధనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వీరశైవ సంఘం సభ్యులు అత్యంత భక్తిశ్రద్దలతో గురు వారం శ్రీబసవలింగేశ్వర స్వామివారికి మహారుద్రాభిషేకం పూజలు నిర్వహించారు. ఉదయం శ్రీనిరంజన మఠంలో శ్రీ బసవ లింగేశ్వర స్వామి వారికి మఠాధిపతులు డాక్టర్ సిద్ధి లింగ మహాస్వామి వారి సమక్షంలో పూజారులు మఠం విజయ్‌కుమార్, గడ్డం చంద్రశేఖర్, మహేష్‌లు శాస్త్రోక్తంగా మంత్రోచ్ఛరణలతో మహారుద్రాభిషేకం నిర్వహించారు. గణపతి పూజ, సంకల్పం, రుద్రాభిషేకం, అర్చన తదితర కార్య క్రమాలను భక్తిశ్రద్దలతో జరిపారు. అష్టోత్తర శతనామావళితో త్రిదళం బిల్వ పత్రాలతో శ్రీబసవేశ్వరస్వామివారికి బిల్వార్చనను అత్యంత వైభవంగా నిర్వహించారు. శివాష్టకం, బిల్వార్చన, లింగాష్టకం, పంచాక్షరీ స్తోత్రం, దూపదీప నైవేద్యాలను స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో శ్రీస్వామివారి పల్లకిసేవ వైభవంగా జరిగింది.



విశేష అలంకరణలతో దర్శనమిస్తున్న స్వామివారు

మున్సిపల్ చైర్మన్‌కు సత్కారం

షాద్‌నగర్, మార్చి 5, ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ ఎన్నికల లో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన అగ్గనూర్ బసవేశ్వర్‌ను సన్మానించిన్న షాద్ నగర్ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ బాబర్ అలీ ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ టీ కరుణాకర్, బాలశివరెడ్డి, భరత్ లాహోటి, టి నవీన్, సందీప్ కుమార్,సురేష్ కుమార్, షాద్నగర్ మార్కెట్ కమిటీ ప్రత్యేక ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్,షాద్ నగర్ వ్యవసాయ సహాయ సంచాలకులు అధికారిణి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం

కుత్బుల్లాపూర్, మార్చి5 ప్రభాతవార్త

రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మూడు కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని కుత్బుల్లాపూర్ మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్ అన్నారు. గురువా రం కుత్బుల్లాపూర్ డివిజన్ చెరుకుపల్లికాలనీ, రామకృష్ణానగర్, గాంధీనగర్ తదితర కాలనీలు,బస్తీలనుండి పెద్దఎత్తున సంక్షేమ సంఘాల ప్రతినిధులు కాంగ్రెస్‌పార్టీలో చేరిన సందర్భంగా చింతల్ లోని పార్టీకార్యాలయంలో వారికి కాంగ్రెస్ కండువను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

తెలతెలవారక ముందే... ఆకస్మిక తనిఖీలతో హల్‌చల్

ప్రజారోగ్యంపై మున్సిపల్ చైర్మన్ ఫోకస్
పారిశుధ్య పనుల తీరుపై ఆరా
అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశం

ఆమనగల్లు, మార్చి 5, ప్రభాతవార్త: ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ నేనావత్ పత్యానాయక్ గురువారం వేకువ జామున పట్టణంలో ఆకస్మిక తనిఖీలు చేసి సిబ్బందిని పరుగులు పెట్టించారు. ప్రజలలో ఉంటూ.. ప్రజల మధ్య తిరుగుతూ.. ప్రజల కోసం తపించి ప్రజలు ఇచ్చిన పదవికి వన్నె చేకూర్చాలన్న లక్ష్యంగా పత్యనాయక్ అడుగులు వేస్తున్నారు. నూతనంగా మున్సిపల్ పగ్గాలు చేపట్టిన ఆయన రాజకీయ వ్యవహారాలు, మున్సిపల్ సమావేశాలు, కార్యాలయానికే పరిమితం కాకుండా ప్రజలకు అధికారులు, సిబ్బంది అందిస్తున్న సేవలను స్వయంగా పరిశీలించటం ద్వారానే తనకు

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న చైర్మన్ పత్యానాయక్

వాస్తవ పరిస్థితిపై అవగాహన వస్తుందని భావించారు. ఈ నేపథ్యంలో గురువారం తెలతెలవారకుండానే వీధుల్లోకి వచ్చి పారిశుధ్య కార్మికుల విధుల తీరుపై స్వయంగా తనిఖీ చేశారు. కార్మికుల సమయ పాలనపై ఆరా తీశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా బాధ్యతతో పనులు నిర్వర్తించాలని సూచించారు. విధుల పట్ల అలసత్వం వహించకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు.ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లపై కూడా నిరంతరం పారిశుధ్య చర్యలు కొనసాగాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపాలిటి వాహనాలను వినియోగించుకోవాలని స్థానికులకు సూచించారు.

అనంతరం 6వార్డులో పర్యటించి.. కమిషనర్ శంకర్‌నాయక్‌తో కలిసి పలు సమస్యలను పరిష్కారించారు. వార్డులోని గుర్రంగుట్ట ప్రాంతంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి కార్మికులు, జేసిబి వాహనాలతో చదును చేయించారు. కార్యక్ర మంలో కౌన్సిలర్ మొక్తాల వెంకటయ్య, కాలనీవాసులు దేరంగుల వెంకటేశ్, వడ్డె గణేశ్ తదితరులు ఉన్నారు.

భూగర్భ డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన

ఆమనగల్లు, మార్చి 5 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారం, పట్టణ అభివృద్దే ధ్యేయంగా ప్రజా పాలన సాగిస్తున్నట్లు ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ నేనా పత్యానాయక్ అన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండడమే కాకుండా ప్రజల చెంతకు పాలన అనుసరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో టియుఎఫ్ఐడిసి నిధులు రూ. 32 లక్షలతో నిర్మించతలపెట్టిన అండర్‌డ్రైనేజీ అభివృద్ధిలో భాగంగా ఆమనగల్లు పట్టణంలోని 15వ వార్డులో నిర్మిస్తున్న

భూమి పూజ చేస్తున్న చైర్మన్

పనులకు గురువారం స్థానిక కౌన్సిలర్ ఎంగలి భాగ్యలక్ష్మిరఘుతో కలిసి పత్యనాయక్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ పత్యనాయక్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో అన్ని వార్డులకు సమ ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధిని కాంక్షిస్తున్నట్లు తెలిపారు. సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీ, వీధిలైట్లు, పారిశుద్ధ్య చర్యలు, మంచినీటి సరఫరాతోపాటు ప్రజా సమస్యలపై కూడా ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పత్యానాయక్ తెలిపారు. అభివృద్దిలో ప్రతిఒక్కరూ బాధ్యతతో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. దశల వారీగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ శంకర్‌నాయక్, కౌన్సిలర్లు ఎర్రవోలు మహేశ్, కాలనీవాసులు, నాయకులు ఎంగలి యాదగిరి, పూసలి సత్యం, జటావత్ చందునాయక్, అరుణ్‌నాయక్, రాజేందర్‌నాయక్, రవినాయక్, వెంకటరెడ్డి, మధు, మహిళలు తదితరులు ఉన్నారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

పూడూరు, మార్చి 5, ప్రభాతవార్త : రైతులు పశువులకు ఎలాంటి రోగాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ సదానందం సూచించారు. గురువారం పూడూరు మండలం పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో పశుసంవర్ధకశాఖ అద్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా సదానందం మాట్లాడుతూ గ్రామాల్లోని పాడి రైతులు తమ పశువుల ఆరోగ్య రక్షణ నిమిత్తం ఉచిత పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని



తిమ్మాపూర్‌లో లేగదూడకు నట్టలమందు వేస్తున్న సిబ్బంది

కోరారు. అనంతరం పశువులకు చూడి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.లేగదూడలకు నట్టల మందులు వేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లలిత అంజనేయులు, పూడూరు పశువైద్యాధికారి డాక్టర్ సజాత్‌అలీ, ఉప సర్పంచ్ కిష్టయ్య, గోపాలమిత్ర సూపర్ వైజర్లు కేశవులు, మైత్రి, గోపాల్, గ్రామస్తులు శివకుమార్ తిర్మలయ్య, దయానంద్, కిష్టయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు సర్జికల్ క్యాన్సర్ టీకాలు

-డిప్యూటీ డిఎంహెచ్ఓ రవీంద్ర యాదవ్

దుద్యాల్, మార్చి 5, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్‌ను డిప్యూటీ డిఎంహెచ్వో రవీంద్ర యాదవ్ సందర్శించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుండి 12 వరకు వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యక్రమాలు తెలిపారు. నాలుగు నెలల్లో 4 సార్లు వివిధ విభాగాల్లో నిపుణులైన డాక్టర్లు పీహెచ్సీల ు సందర్శించి సేవలు అందిస్తారన్నారు. వైద్య విధాన పరిషత్ లో ఉండే నిపుణులు ఈ నెల 6 నుండి 12 వరకు మాతా శిశు మరియు 60 సంవత్సరాల పైబడిన వాళ్లకు ఆరోగ్య సమస్యలపై చికిత్స చేస్తారన్నారు. స్పెషల్ డాక్టర్ల టీమ్స్ స్కూల్స్‌ని విజిట్ చేస్తారన్నారు. హెచ్ పివి వ్యాక్సిన్ సైతం త్వరలో ప్రారంభిస్తామని 14 ఏళ్ళు ఆ పై వయస్సు వారు హెచ్ పివి వ్యాక్సిన్

మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్‌వో

తీసుకోవాలన్నారు. సర్వికల్ క్యాన్సర్ (గర్భాశయ) క్యాన్సర్ నివారణకు ప్రివెన్షియల్‌గా ఉపయోగపడుతుందన్నారు. ముందుగా వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి, తాండూర్ జిల్లా ఆసుపత్రిలో డాక్టర్ల పర్యవేక్షణలో టీకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. 14 సంవత్సరాల వయస్సు పాఠశాల స్థాయి విద్యా శాఖ నుండి విద్యార్థుల లిస్టు తీసుకోవడం జరిగిందన్నారు. హెచ్ పివి వ్యాక్సిన్ ప్రైవేట్ లో ఒక డోస్ 8 నుండి 10వేలు ఉంటుందని అన్నారు. హెచ్ పివి వ్యాక్సిన్ ఎప్పటి ండో అందుబాటులో ఉందని, సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో హకీంపేట్ పీహెచ్సీ డాక్టర్ వందన రాజన్, దుద్యాల్ సబ్ సెంటర్ డాక్టర్ విద్య, ఏఎన్ఎం రాములమ్మ, ఆశ వర్కర్లు స్వాతి, సరిత పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి రూ. 1.5 లక్షలు అందజేత

మేడ్చల్, మార్చి. ప్రభాతవార్త : మేడ్చల్‌లో నిర్వహించిన రామలింగేశ్వర జాతర సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ యజమానులు పాఠశాలకు రూ. 1.5 లక్షను అందజేశారు. జాతర సందర్భంగా దుకాణాలు పెట్టుకుని పాఠశాల అభ్యున్నతికి గాను ముందుగా చేసు కున్న ఒప్పందం ప్రకారం డబ్బులను గురువారం పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీకి అందించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు బాలమల్లేష్, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

అందజేస్తున్న షాపుల యజమానులు

నానో ఎరువులతో పర్యావరణ పరిరక్షణ

షాద్‌నగర్, మార్చి 5, ప్రభాతవార్త : వ్యవసాయ శాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో చించోడ్ రైతు వేదికలో రైతులకు నానో ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, నూనె గింజల పంటల సాగుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు, నిపుణులు రైతులకు నానో ఎరువుల ప్రాముఖ్యత గురించి వివరించారు. నానో యూరియా, నానో డీఏపీ వంటి ఎరువులను సరైన మోతాదులో పంటలకు పిచికారీ చేయడం ద్వారా పంటల ఎదుగుదల మెరుగుపడటంతో పాటు, ఎరువుల వినియోగం తగ్గి ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. పర్యావరణానికి హాని లేకుండా పంటల ఉత్పత్తి పెరుగుతుందని వివరించారు. అదేవిధంగా రైతులకు ప్రకృతి వ్యవసాయం పద్ధతుల గురించి కూడా అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ గోమూత్రం, గోమయం వంటి సహజ వనరులను ఉపయోగించి జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం వంటి ద్రావణాలను తయారు చేసి పంటలకు వినియోగించడం వల్ల నేల సారం పెరిగి, పంటలు ఆరోగ్యంగా పెరుగు తాయని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం కాపాడబడటంతో పాటు రైతులకు ఖర్చులు తగ్గి లాభాలు పెరుగుతాయని

మాట్లాడుతున్న వ్యవసాయాధికారి నిశాంత్

తెలిపారు. ఈ కార్యక్రమంలో నూనె గింజల పంటల సాగుపై కూడా ప్రత్యేకంగా చర్చించారు. నువ్వులు, వేరు శెనగ, సూర్యకాంతి వంటి నూనె గింజల పంటలను సాగు చేయడం ద్వారా రైతులు మంచి ఆదాయం పొంద వచ్చని అధికారులు వివరించారు. ప్రభుత్వం నూనె గింజల పంటల సాగు ను ప్రోత్సహించడానికి చేపడుతున్న పథకాలు, సబ్సిడీలు మరియు సాంకేతిక సహాయంపై కూడా రైతులకు వివరిం చారు. సమావేశంలో రైతులు పంటల సాగు, ఎరువుల వినియోగం మరియు ప్రకృతి వ్యవసాయం అమలుపై పలు సందేహాలను అడిగి నివృత్తి చేసుకు న్నారు. అధికారులు రైతులకు పంటల దిగుబడులు పెంచుకోవడానికి ఆధునిక సాంకేతిక పద్ధతులను అనుసరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఫరూ ఖ్ నగర్ మండల వ్యవసాయ శాఖ అధి కారి నిషాంత్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు హైమావతి, ప్రణీత, చించోడ్ పరిసర గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ దీపక్ తివారి

అంగన్వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

దుద్యాల్, మార్చి 5, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని ఒకటి, రెండవ అంగన్వాడి కేంద్రాల ు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆస్మికంగా సందర్శించారు. పిల్లల ఆరోగ్య పరిస్థి తిపై దృష్టి సారించాలని ఆదేశించారు. పోషకాహారం, హాజరు నమోదు, పుస్తకాలు, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలపై ఆరాతీశారు. కల ర్స్, నంబర్స్ అడుగుతూ పిల్లల్లో ఉన్న పరిజ్ఞానాన్ని పరిశీలించారు. పిల్ల లతో పాటు కలెక్టర్ ఇతర అధికారులు భోజనం చేశారు. గర్భిణీలు, బాలిం తలకు అందిస్తున్న సప్లమెంటరీ పోషకాహారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి సిబ్బం దికి పలు సూచనలు చేస్తూ పిల్లల ఆరోగ్యం భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రీ స్కూల్ విద్యా కార్యక్రమాల ు మరింత మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా శిశు సంక్షేమ అధికారిని కృష్ణవేణి, తహసిల్దార్ కిషన్, ఎస్సై శ్రీశైలం, ఎంపీడీవో జైపాల్ రెడ్డి, ఎంఈవో శంకర్, సిడిపివో ఫ్యాక్ నిర్మల, అంగన్వాడి సూపర్వైజర్ జయశ్రీ, ఎంపీవో సత్యనారాయణ, సర్పంచ్ సంగీత, అంగన్వాడి టీచర్లు రెహానా, వెంకటమ్మ, స్థానిక నాయకులు మేర్గు వెంకటయ్య, వేణుగోపాల్, శ్రీశైలం, ఖాజ, రమేష్, కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

జవహర్‌నగర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త: నిరక్ష్య ్యప్ల డ్రైవింగ్ కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు తీవ్రంగా గాయపడగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. జవహర్ నగర్ పోలీసుల కథనం ప్రకారం... శాంతినగర్‌కు చెందిన అజయ్ (22), వృత్తిరీత్యా డ్రైవర్. గురువారం సాయంత్రం తన స్నేహితుడు ఎరుమన్‌తో కలిసి పల్సర్ బైక్‌పై చెన్నాపురం నుండి ఆర్మీ డెంటల్ కాలేజ్ వైపు వెళ్తున్నారు. ఆర్మీ డెంటల్ కాలేజ్ సమీపంలో ఎదురుగా వస్తున్న టాటా నెక్సాన్ కారు అతి వేగంగా వచ్చి బైక్‌తోపాటు మరో స్కూటీని ఢి కొట్టింది. ఈ క్రమంలో బైక్‌పై ఉన్న అజయ్ తీవ్ర గాయాలయ్యాయి. అతని స్నేహితుడు ఎరుమన్‌కు గాయాలయ్యాయి. స్కూటీపై ప్రయాణిస్తున్న వారికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి తల్లి రాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

మంగమ్మకు నివాళులు అర్పిస్తున్న టిజిఓ నాయకులు

మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కి పరామర్శ

రంగారెడ్డి అర్బన్, మార్చి 5, ప్రభాతవార్త: కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్‌కు మాతృ వియోగం కలగడంతో ఆయన కుటుంబ సభ్యులను పలువురు నాయ కులు, అధికారులు పరామర్శించి సానుభూతి తెలిపారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టి.జి.వో) హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ అధ్యక్షుడు ఎం.బి. కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో టి.జి.వో అధికారుల బృందం కడ్తాల్ మండలంలోని చెన్నంపల్లిలోని గుర్కా జైపాల్ యాదవ్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. మంగమ్మ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి తనయుడు నాగం శశిధర్ రెడ్డి, యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటనర్సయ్య యాదవ్, వైస్ చైర్మన్ బి. రాములు యాదవ్, చైర్మన్ శంతన్న యాదవ్, శ్రీనివాస్ యాదవ్, బాలగౌడ్, ఆర్. రవి, కౌన్సిలర్ అర్జునయ్య, టి.జి.వో హైదరాబాద్ బ్రాంచ్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ కొత్త విద్యాసాగర్, పి. పిరయ్య యాదవ్, రవీందర్ పాల్గొన్నారు.

మున్సిపల్, ఎంఎంసి చైర్మన్‌లకు సన్మానం

శంకర్‌పల్లి, మార్చి 5, ప్రభాతవార్త : శంకర్ పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ గోవిందమ్మ గోపాల్‌లను సీనియర్ న్యాయవాది, హైదరాబాదులోని వివి హాస్టల్ సెక్రెటరీ గుండ గౌరీ శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గౌరీ శంకర్ మాట్లాడుతూ 3వ వార్డులో విజయం సాధించిన తన సోదరుడి వెనుక స్నేహితులు సన్నిహితులు ప్రతి ఒక్కరి కృషి ఉందన్నారు. ముఖ్యంగా ప్రవీణ్ కుమార్ గోపాల్ రెడ్డి అత్యంత దగ్గరగా ఉండి పలు సూచనలు చేస్తూ బాధ్యతను భుజాల మీద ఎత్తుకొని ఉధృతంగా ప్రచారం చేశారన్నారు. పార్టీ టికెట్ ఇప్పించటంలో ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాకీర్ అహ్మద్ బెజుగం, రాజేశ్వర్ కందూరి చంద్రకుమార్, ముదిగొండ శివశంకర్, కాశెట్టి ఆనంద్, గుండా శేఖర్, ఎస్పీ లింగం, శివానందం, శ్రీనివాసచారి, న్యాయవాది ప్రభాకర్, వివి హాస్టల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న డాక్టర్ వైభవ్‌రెడ్డి

ఆలయాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం

చేవెళ్ల, మార్చి 5, ప్రభాతవార్త : చేవెళ్ల మండలంలోని నాంచెరి గ్రామంలో ఉన్న మల్లన్న, బీరప్ప గుడి అభివృద్ధి కోసం డాక్టర్ వైభవ్ రెడ్డి భారీ విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అశోక్‌కు రూ.50,000లను విరాళంగా అందజేశారు. అదేవిధంగా కొత్తపల్లి గ్రామంలోని ఈదమ్మ గుడి అభివృద్ధికోసం మరో రూ.50,000లను విరాళంగా బీజేపీ నాయకులు ప్రకాశ్ గౌడ్ కి అందించి తన సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, వైభవ్ రెడ్డిని అభినందించారు.

ఆర్డీవోను సన్మానిస్తున్న నాయకులు

ప్రజలకు పారదర్శకంగా సేవలందించండి

చేవెళ్ల, మార్చి 5, ప్రభా తవార్త : చెవెళ్ల ఆర్డీ వోగా బాధ్యతలు స్వీక రించిన పార్థసింహ రెడ్డి ని 10వ వార్డు కౌన్సి లర్ దయాకర్, డాక్టర్ వైభవ్ రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు అత్తెలి అనంతరెడ్డి, బీజేపీ చెవెళ్ల మున్సిపల్ నాయ కులు, కార్యకర్తలు కలిసి శాలువాతో సత్కరించి స్వాగతం పలి కారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతల్లో ప్రజలకు పార దర్శకంగా సేవలు అందించాలని ఆకాంక్షి ంచారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి హామీ

మొయినాబాద్, మార్చి 5, ప్రభాతవార్త: మొయినాబాద్ మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ కర్రోళ్ల శ్రీధర్ స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టారు. సురంగల్ గ్రామ పరిధిలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ పనిచేయడం లేదు. అదేవిధంగా ఆర్‌టిసి బస్సు సౌకర్యంలేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ అంశాలను శ్రీధర్ స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే స్పందిస్తూ ఆయన మెహిదీపట్నం డిపో మేనేజర్‌కు ఫోన్ చేసి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. విద్యుత్ శాఖ డిఇ రమేష్ చంద్రతో కూడా ఫోన్‌లో మాట్లాడారు. ఈ నేపథ్యంలో గురువారం కోకాపేట్ పరిధిలో ఉన్న డిఇ కార్యాలయానికి వెళ్లిన కౌన్సిలర్ శ్రీధర్ గ్రామంలో ఉన్న విద్యుత్ సమస్యను డీఈ రమేష్ చంద్రకు వివరించారు. వారం రోజుల్లో కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తామని డీఈ హామీ ఇచ్చారు.

కలెక్టర్ ఉపాధ్యాయుడైన వేళ...

దుద్యాలలో టెన్త్ విద్యార్థులకు పాఠాలు

విద్యార్థులతో కలిసి డిజిటల్ పాఠాలు వింటున్న కలెక్టర్ దీపక్ తివారి

దుద్యాల్, మార్చి 5, ప్రభాతవార్త: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాల ు అధిరోహించాలని కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ు ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయుడిగా మారి పదవ తరగతి విద్యార్థులకు విద్య ను బోధించారు. ప్రశ్నలు వేసి విద్యార్థులతో జవాబులు రాబట్టారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలు సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు.

నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు. రాబోయే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తెచ్చే విధంగా మే నెల చివరి కల్లా ప నులు పూర్తి చేసి భవనాన్ని అప్పగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సైన్స్ ల్యాబ్, ఆఫీస్ రూమ్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారుల ు ఆదేశించారు.

మూత్రశాలల ు పరిశీలించి పరిశుభ్రత పాటించాలని, ట్యాప్స్ ఏర్పాటు చేసి సరియైన నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప నుల ు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని నిర్మాణంలో ఉన్న ఇండ్లు ఏ దశలో ఉన్నాయో ఇప్పటివరకు ఎన్ని బిల్లులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న అంగన్వాడి భవనాన్ని పరిశీలించారు. అభివృద్ధి కార్యక్రమాలలో సమస్యలు తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, హౌసింగ్ పీడీ ముక్రం భాష, ఎంఈవో శంకర్, తహసిల్దార్ కిషన్, సర్పంచ్ సంగీత, ప్రధానోపాధ్యాయుడు మల్లప్ప, ఎంపీడీవో జైపాల్ రెడ్డి, ఎంపీవో సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ సుస్మిత, ఆర్ఐ నవీన్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, ఇతర అధికారులు, స్థానిక నాయకులు మేర్గు వెంకటయ్య, శ్రీశైలం, ఖాజ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS

డాక్యుమెంట్ పోయింది

★ నేను, బి. శివరాజ్ తండ్రి: బి. నరసింహ, నివాసం: జన్వాడ గ్రామం, శంకర్‌పల్లి మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-500075. మా ఇంటి భూమికి సంబంధించిన నవాబ్‌పేట్ మండలం, పూలపల్లి గ్రామం, సర్వే నం.178/ఎ1 ఒరిజినల్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నం. 2534/2021 పోయినది. ఎవరికైనా దొరికినట్లయితే ఈ సెల్ నం. 8121723727 కు సంప్రదించగలరు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

సింగర్స్‌కి బహుమతుల్ని అందజేసిన సినీ గేయ రచయిత చంద్రబోస్

పాటల పోటీలో గెలుపొందిన సింగర్ కు బహుమతి అందజేస్తున్న ఆస్కార్ విన్నర్ చంద్రబోస్, బి.వెంకటేశ్వర్లు, ప్రవీణ్ కొప్పుల, సబిత మట్ల

కూకట్‌పల్లి, మార్చి 5, ప్రభాతవార్త :

కూకట్‌పల్లిలోని ప్రేకాస స్టూడియోలో నిర్వహించిన పాటల పోటీ ల్లో గెలుపొందిన గాయకులకు ఆస్కార్ విన్నర్ సినీ గేయ రచయిత చంద్రబోస్, సింగర్ కొప్పోలు ప్రవీణ్ బహుమతులను అందజేశా రు. ఈ సందర్భంగా చంద్రబోస్ మాట్లాడుతూ నేటి తరం యువత తెలుగు పాటలోని కమ్మదనాన్ని తమ గళంతో శ్రావ్యంగా ఆలవి స్తున్నారని అన్నారు. పాటల పోటీలో విజేతలు మున్ముందు మరిన్ని మంచి పాటలు పాడి శ్రోతల మన్ననల్ని అందుకోవాలని ఆకాంక్షి ంచారు. పాటల పోటీలను నిర్వహించిన ప్రేకాస స్టూడియో నిర్వాహకులు కాశీ జొన్నవిత్తుల, సబిత మట్ల, ప్రేమ్ సాగర్ ఇర్లాలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. పోటీలు తమలో ఉన్న నైపుణ్యాన్ని మరింత పెంపొందిస్తుందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర మీడియ సెల్ అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లును సన్మా నించారు. ఇక్కడ స్టూడియోలో ఏర్పాటుచేసి గాయనీగాయకులకు అందుబాటులోకి తీసుకువచ్చారని చంద్రబోస్ తెలిపారు. ప్రేకాస నిర్వాహకులు నిర్వహించిన ప్రేకాస ఐకాన్ సింగింగ్ కాంపిటీషన్ సీజన్ వన్‌కి జడ్జిగా ప్రవీణ్ కుమార్ కొప్పుల వ్యవహరించారు. ఫైనల్ రోజున ముఖ్య అతిథిగా ఆస్కార్ విన్నర్ చంద్రబోస్ పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో ప్రేకాస నిర్వాహకులు సబిత మట్ల, ప్రేమ్ సాగర్ లు పాల్గొన్నారు.

2026 పరాభవ నామ సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి మార్చి 5 (ప్రభాతవార్త) : ప్రముఖ జ్యోతిష్య శాస్త్రవే త్త, కల్యాణానంద పీఠం అధిపతి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త , బ్రహ్మశ్రీ డాక్టర్ పులిగడ్డ హనుమంతరాయ శర్మ రూపొందించిన 2026 శ్రీ పరాభవఖి నామ సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం జరిగింది. భక్తి, ఆధ్యాత్మికత ఖచ్చితమైన తిథి, నక్షత్ర గణితంతో కూడిన ఈ క్యాలెండర్ సామాన్య భక్తులకు, పండితులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. దృక్ సిద్ధాంతం ప్రకారం పండుగలు, పర్వదినాలు మరియు గ్రహణాల వివరాలను క్షుణ్ణంగా పొందుపరిచారు. కల్యాణానంద పీఠం ఆధ్వర్యంలో ప్రతి ఏటా లోక కళ్యాణం కోసం జ్యోతిష్య మార్గదర్శకాలను హనుమంతరాయ శర్మ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్తలు, పీఠం ప్రతినిధులు, ప్రము ఖులు పాల్గొని హనుమంతరాయ శర్మ గారి కృషిని కొనియాడారు. ఈ క్యాలెండర్ త్వరలోనే అన్ని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాల్లో అందుబాటులోకి రానుంది.

క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరిలో అవగాహన అవసరం

..డాక్టర్ యు.ఆజాద్ చంద్రశేఖర్

చిక్కడపల్లి మార్చి 5 ప్రభాతవార్త : క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరిలో అవగాహన చాలా అవసరమని ప్రముఖ సర్జికల్ ఆంకా లజిస్ట్, దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డా. యు. ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం విద్యా నగర్ లోని హస్పిటల్ ఆధ్వర్యంలో కాన్సర్ పై అవగహన కార్యక్ర మంలో భాగంగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన 36 ఏళ్ల సంసున్ నహర్ బీబీ అనే మహిళ కుడి ఛాతీలో ఏర్పడిన భారీ కణితిని సురక్షి తంగా తొలగించి ఆమెకు కొత్త జీవితం అందించారు. అత్యా ధునిక సాంకేతికత, నైపుణ్య వైద్య బృందం, అంతర్జాతీయ ప్రమాణాల చికిత్సా విధానాలతో సంక్లిష్ట క్యాన్సర్ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్ర మంలో వైద్యులు డాక్టర్ రవి కుమార్ రెడ్డి, డా.విశాల్ డాక్టర్ రాకేష్ కుమార్ డాక్టర్ ఉల్లాస్, డాక్టర్ దిలీప్, డాక్టర్ హబీబ్, డాక్టర్ కిషోర్, డాక్టర్ సమంత్, డాక్టర్ రాకేష్, డాక్టర్ గౌతమి, రవీంద్ర నాథ్ గరగ, సి ఓ ఓ డా.మధుసూదన్ రావు, మెడికల్ సూపరిం టెండెంట్, శ్రీవల్లి, సెంటర్ హెడ్ లతో పాటు పలువురు వైద్యులు, వైద్యేతర సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

నేడు శిల్పకళావేదికలో సిఎంకు సన్మాన సభ

-మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డీనేటషన్ కమిటీ

హైదరాబాద్, మార్చి 5,ప్రభాతవార్త:

మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డీనేటషన్ కమిటీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి సన్మానసభ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపా రు. ఈమేరకు గురువారం విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం హైటెక్ సిటీ శిల్పకళావేదికలో మధ్యాహ్నం 12గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపా రు. ఎస్సీ రిజర్వేషన్‌వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన సీఎం రే వంత్‌రెడ్డికి జరిగే ఈ సన్మానసభకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి మాదిగ ఎంప్లాయిస్ పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

నూతన ఎంఇఓ నిరంజన్‌కు శుభాకాంక్షల వెల్లువ

నార్సింగి, మార్చి 5 ప్రభాతవార్త : మణికొండ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ గండిపేట మండల ఎంఇఓగా పదోన్నతి పొందారు. గురువారం ఆయన పదవీ బాధ్యతను చేప ట్టారు. ఈ సందర్భంగా నిరంజన్‌ను మణికొండ మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ కొండకల్ల రామకృష్ణారెడ్డి తదితరు లు ఎంఇఓకు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేదలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన చేస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న నిరంజన్‌కు ఎంఇఓ పదవి రావడం చాలా సంతో షంగా ఉందన్నారు. పేద విద్యార్థులను మట్టిలో మాణిక్యాలుగా మారుస్తున్నారని

గండిపేట మండల నూతన ఎంఇఓ నిరంజన్‌ను సన్మానిస్తున్న నాయకుల దృశ్యం

వివరించారు. ఇన్నాళ్లు మణికొండ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి విద్యను విద్యార్థులకు అందించారని,అలాగే ఇప్పు డు గండిపేట మండలం మొత్తం పాఠశాలలో కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కృషి చేస్తారని నేతలు ధీమా వ్యక్తం చేశారు. ఉపాధ్యయ వృత్తి చాలా పవిత్రమైందని, భావి భారత పౌరులను తయారు చేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని, దాన్ని నూతన ఎంఇఓ నిరంజన్ చలా చక్కగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన నాయ కులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులందరికి నిరంజన్ కృతజ్ఞతలు తెలిపారు. మీ అందరి సహకారం తీసుకొని గండిపేట మండలంలోని ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్యాబోధనను విద్యా ర్థులకు అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వవరిం చారు. గత ఏడాదికంటే అధికంగా పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం ను తీసుకు వచ్చేందుకు ప్రణాలికబద్ధంగా విద్యార్థులకు చదువులు చెప్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్దప్ప, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసిన ఇఓ పెద్దిగారి శ్రీకాంత్

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 5, ప్రభాతవార్త

కూకట్‌పల్లిలోని సీతారామచంద్రస్వామి దేవాలయానికి నూతన కార్యనిర్వ హణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన పెద్దిగారి శ్రీకాంత్ గురువారం కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావుని కలిశారు. ఈ సందర్భంగా దేవాలయ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమా లు, అలాగే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దేవాలయ అభివృద్ధి నిర్వహణను మరింత సమర్ధ వంతంగా కొనసాగించేందుకు అవసరమైన సహకారం అందించాలని శ్రీకాంత్ కోరారు. దీనికి స్పం దించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దేవాలయ అభి వృద్ధి కార్యక్రమాలకు తమవంతు సహకారం అంది స్తామని తెలిపారు. భక్తులకు సౌకర్యవంతమైన వాతావర ణం కల్పించేందుకు ఆలయ నిర్వహణ మరింత బలో పేతం కావాలని ఆకాంక్షి ంచారు.

అంబర్‌పేటలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ దిష్టిబొమ్మ దగ్ధం

కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న మహిళా కాంగ్రెస్ నాయకురాలు శంభుల ఉషశ్రీకాంత్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, మార్చి 2, ప్రభాతవార్త

కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్‌సింగ్ పూరి రాజీనామా చేయాలని మహిళా కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లంబ,రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావుల ఆదేశాల మేరకు కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి రాజీనామా చేయాల్సిందిగా డిమాండ్ చేస్తూ బ్లాక్ జెండాలు పట్టుకొని, పీఎం మోడీ కాంప్రమైజ్ టీషర్టులను ధరించి, భారీ ఎత్తున మహిళలతో నినాదాలు చేస్తూ, ర్యాలీ తీశారు. అనంతరం హర్దీప్ సింగ్ పూరి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భం గా జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ మాట్లాడుతూ, భేటీ బచావో బేటి పడావో అని నినాదం చేస్తున్న మోడీ, ఇప్స్టీ ఎస్టీమ్స్ ఫైల్స్ లో కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి పేరు వచ్చినందుకు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. తీవ్ర సైకో అయిన, రేపిస్ట్ ఆడపిల్లల్ని కిడ్నాప్ చేసి వారిపై అత్యాచారం చేసిన రేపిస్ట్ మంత్రికి సంబంధాలు కలిగి ఉండడాన్ని ఖండించారు. ఇదేనా మోడీ బేటి పడావో బేటి బచావో అంటూ నిలదీ శారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ చేస్తున్న ఈ సంఘ ర్షణకి మహిళా కాంగ్రెస్ తరపున మా ఈ పోరాటం కేంద్ర మంత్రి రాజీనామా చేసే వరకు కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బమ్మ ,జి ల్లా సెక్రెటరీ శాంతమ్మ, కాంసెన్సీ ప్రెసిడెంట్లు కమల, మా ధవి, బ్లాక్ ప్రెసిడెంట్‌లు ప్రసన్న భారతి, వనజ, అనిత, డివి జన్ ప్రెసిడెంట్లు శ్రీలత, రజని, అయేషా, ఫాతిమా, పద్మ, దుర్గ, సౌమ్య, దుర్గ, లావణ్య, లక్షి ్మ, సంధ్యారాణి, ప్రియాం క, రమ్య తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని దూరం చేసేందుకు క్రీడలు దోహదం : డిసిపి రక్షిత మూర్తి

చిక్కడపల్లి మార్చి 5 (ప్రభాతవార్త) : పోలీసుల విధి నిర్వహణలో మానసిక ఒత్తిడిని దూరం చేసేందుకు క్రీడ లు ఎంతగానో దోహదపడతాయని సికింద్రాబాద్ జోన్ డిసిపి రక్షి త మూర్తి అన్నారు. గురువారం బాగ్ లింగం పల్లి సరోజినీ క్రికెట్ అండ్ ఫిట్‌నెస్ అకాడమీలో ఏర్పాటు చేసిన ఖిసికింద్రాబాద్ జోన్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ఖిను ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘ నంగా ప్రారంభించి ప్రసంగించారు. నిరంతరం ప్రజల రక్షణ కోసం శ్రమించే పోలీసులు తమ ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని సూచించారు. క్రీడలు కేవలం వినోదం కోసమే కాకుండా, సిబ్బంది మధ్య ఐక్యతను, క్రమశిక్షణ ను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అదనపు డిసిపి నర్సయ్య మాట్లాడుతూ జోన్ పరిధిలోని వివిధ విభాగా ల నుండి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొనడం అభినం దనీయమని, గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తితో ఆడటం ముఖ్యమని తెలిపారు. సికింద్రాబాద్ జోన్ పరిధి లోని వివిధ పోలీస్ స్టేషన్ల సిబ్బంది, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సరోజినీ క్రికెట్ అండ్ ఫిట్‌నెస్ అకాడమీ మైదానం క్రీడాకారుల కోలాహలంతో సందడిగా మారిం ది. ఈ కార్యక్రమంలో

సికింద్రాబాద్ జోన్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న సికింద్రాబాద్ జోన్ డిసిపి రక్షి త

చిక్కడపల్లి, చిలకలగూడ, గాంధీన గర్, ఉస్మానియా యూనివర్సిటీ, మహంకాళి డివిజన్ ఏసీపీలు ఎల్ రమేష్ కుమార్, కె.శేషాంక్ రెడ్డి, ఏ.యా దగిరి, ఎం.జగన్, పి.సుబ్బయ్య, చిక్కడపల్లి, ముషీరా బాద్, కాచిగూడ, చిలకలగూడ, లాలాగూడ, వారాసి గూడ, గాంధీనగర్, దోమలగూడ, ఉస్మానియా యూని వర్సిటీ, నల్లకుండా, అంబర్ పెట్, మహంకాళి, రాంగోపాల్ పెట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు ఇతర పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా 99 రోజుల 'ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక'

- రాజేంద్రనగర్ జెడ్సీ మంద మకరంద్

చాంద్రాయణగుట్ట, మార్చి 5, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వ 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'ను విజయవంతం చేసేందుకు సర్కిల్లో 99 రోజుల కార్యచరణ ప్రణాళికను రూపొందించాలని జీహెచ్‌ఎంసి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ మంద మకరంద్ అధికారులను ఆదేశించారు. గురువారం చాంద్రాయణగుట్ట సర్కిల్లోని హఫీజ్ బాబాన గర్, కంచన్‌బాగ్ తదితర ప్రాంతాలలో పర్యటించి స్థానిక ప్రజలతో ముచ్చటించారు. స్వచ్ఛ ఆటలలో ఇంటింటి నుండి చెత్త తరలింపు, బస్తీలలో, పాదాచారుల వంతెన, ప్రధాన రోడ్లు, ప్రభుత్వ భవనాల వద్ద పారిశుద్యం తదిత రాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా జెడ్సీ మంద మకరంద్ మాట్లాడుతూ ప్రస్తుత పవిత్ర రంజాన్ మాసంలో ప్రార్థనా మందిరాల వద్ద, ప్రధాన రహదారు లపై పారిశుధ్య సమస్య లేకుండా పర్యవేక్షించాలని ఆదే శించారు. అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. ఈనెల 6వ తేదీ నుండి జూన్ 12 వరకు మూడు నెలల (99 రోజులు) పాటు జరిగే ప్రజాపాలన ప్రగతి ప్రణాళి కలో జీహెచ్‌ఎంసి పరిధిలోని పారిశుద్యం, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, అర్బన్

సమస్యలపై స్థానికులతో చర్చిస్తున్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ మంద మకరంద్, డీసీ సురేందర్లు

బయోడైవర్సిటీ, మలేరియా, యూసిడి, ఫుడ్ సేఫ్టీ, ఆస్థిపన్ను తదితర విభాగాలకు చెందిన అధికారులు బాధ్యతో విధులు నిర్వహించాల న్నారు. ఆస్థిపన్ను వసూలు విషయంలో మొండి బకాయి ల వసూలుకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. డాకెట్ల వారిగా ఇచ్చిన టార్గెట్లకు అనుగుణంగా ఆస్థిపన్ను వసూలు చే యాలని, పెండింగ్‌లో ఉన్న ఫైళ్ళను సాధ్యమైనంత త్వం గా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ పర్యవేక్షణలో చాంద్రాయణగుట్ట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వి.సురేం దర్, ఎస్‌డబ్ల్యూఎం డిఇ ఎన్.బానుప్రతాప్, ఇంజనీరింగ్ డిఇ ప్రశాంత్, ఏఇలు, రాంకీ అధికారులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహ ఏర్పాటును ఆపండి..మీనాక్షీ నటరాజన్‌కు మూసీ జన్ ఆందోళన్ లేఖ

హైదరాబాద్, మార్చి 5,ప్రభాతవార్త: మూసీ నది ఒడ్డున తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు విషయంలో జోక్యం చేసుకోవాలని ఏఐసీసీ వ్యవహా రాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్‌కు మూసీ జన్ ఆందో ళన్ లేఖ రాసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ గ్రామంలో 10.34 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వం సంకల్పిం చిందని దీని వల్ల మధు పార్క్ రిడ్జ్ అపార్ట్మెంట్స్ నివా సులను ప్రభావితం చేస్తోందని పేర్కొ న్నారు. ఈ ప్రాజెక్టు కోసం అదనంగా తెలంగాణ ప్రభు త్వం98.20 ఎకరాల రక్షణ శాఖ భూమిని బదిలీ చేయ మని కోరడంతో పాటు. ఈ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్ర మానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ను గత నెల 12న స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానిం చారని ప్రజల వ్యతిరేకతను, ప్రజాస్వామ్య ప్రక్రియలను పట్టించుకోకుండా ఇలా చేయటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోం దని లేఖలో పేర్కొన్నారు.ప్రతిపాదిత మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ లో భాగమైన "గాంధీ సరోవర్ ప్రాజెక్ట్" విషయంలో మేము తీవ్ర అభ్యం తరాలు, ఆందో ళనలు వ్యక్తం చేస్తున్నామని సివిల్ సొసైటీ కార్యకర్తలు, పర్యావరణవాదులు, మానవ హక్కుల సంస్థలు, స్థానిక నివాసితులతో కూడిన ఈ నెట్వర్క్ ప్రాజెక్ట్ ప్రారం భోత్సవాన్ని వెంటనే ఆపాలని, ప్రజాస్వామ్య చర్చల ద్వారా పూర్తి సమీక్ష చేయాలన్నారు. ఈ విషయంలో మీ రు జోక్యం చేసుకోవాలని మీనాక్షి నటరాజన్‌ను కోరారు. విగ్రహం ఏర్పాటును మహాత్మా గాంధీ మునిమనుమడు తుషార్ గాంధీ కూడా అభ్యంతరం వ్యక్తం చేశారని లేఖ లో ప్రస్తావించారు. ఈ ప్రాజెక్ట్ ప్రస్తుత రూపంలో కొనసాగితే మన సహజ వార సత్వానికి తిరిగి రాని నష్టం కలిగిస్తుందని గుర్తిం చాల న్నారు . స్థానిక ప్రజలలో ఉన్న ఈ

రసమయి ఆధ్వర్యంలో లలిత సంగీతానికి పట్టాభిషేకం

చిక్కడపల్లి మార్చి 5, ప్రభాతవార్త : రసమయి సంస్థ ఆధ్వ ర్యంలో ఖిలలిత సంగీతానికి పట్టాభిషేకంఖి అనే ప్రత్యేక సాం స్కృతిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. చిక్కడ పల్లి త్యాగరాయగానసభలో తొమ్మిదవ తేదీన జరిగే కార్యక్ర మా నికి హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ ము ఖ్య అతిథిగా హాజరవుతారని, ప్రముఖ కవి, లలిత గేయ కళా నిధి మరియు రసమయి అధ్యక్షులు డాక్టర్ ఎం .కె.రాము జన్మదినో త్సవాన్ని పురస్కరించుకుని గాయని గాయకులను సత్కరిస్తారు. మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగో పాల చారి అధ్య క్షతన జరిగే కార్యక్రమంలో అతిథిలుగా పూర్వ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, ఆదాయపుపన్ను శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ ఎం. నరసింహప్ప తదితరులు పా ల్గొంటారు. ఈ కా ర్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయకుడు కె. రామాచారి నిర్వ హణలో డాక్టర్ ఎం.కె .రాము రచించిన లలిత గీతాల గానం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్రముఖ గాయనీ గాయకులు కె.ఎస్.ఆర్. మూర్తి, శశికళాస్వామి, సురేఖా మూర్తి, విజయ లక్ష్మి, హిమబిందు, వినోద్ బాబు, లిటిల్ మ్యూజీషియన్స్ అకాడ మీ సభ్యులు తమ గానంతో అలరించనున్నారు. ఈ కార్యక్ర మానికి ఎం.కె.ఆర్. ఆశాలత వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారు.

వాటర్ ట్యాంకర్లపై చర్యలు తీసుకోండి : కొండల్‌రెడ్డి

శేరిలింగంపల్లి,,మార్చి 5 ప్రభాతవార్త

శేరిలింగంపల్లి నియోజక వర్గం లోని పలు ప్రాంతాల్లో నిబంధ నలకు విరుద్ధంగా బోర్లద్వారా నీటి ట్యాంకర్ల అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయని, వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని మదర్‌సేవా సమితి ఛైర్మన్, పాపిరెడ్డికాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్య క్షులు బద్దం కొండల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శేరిలింగంపల్లి ఎమ్మార్వో మహిపాల్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బద్దం కొండల్‌రెడ్డి మాట్లాడుతూ..శేరిలింగంపల్లి మండలంలోని చందానగర్,మదీనాగూడ, కొండాపూర్, తదితర ప్రాంతాల్లో వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ అక్రమంగా బోర్లు వేసి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తూ లక్షల రూపాయలను అర్జిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నీటి వ్యాపారం విచ్చలవిడిగా చేస్తుండటంతో చుట్టు పక్కల కాలనీల్లోని బోర్లు ఎండిపోయి వేలరూపాయలు వెచ్చించి నీటిని కొనుగోలు చేసుకోవాల్సి న పరిస్థితి ఏర్పడిందని ఆయన వాపోయారు. మద్యం మత్తులో కొందరు డ్రైవర్లు బోర్ నీటి ట్యాంకర్లను రాత్రి,పగలు తేడాలేకుండా హైస్పీడ్‌తో కాలనీల్లో పరుగులు పెట్టిస్తూ పలుమార్లు ప్రమాదాలకు గురై విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని,మృతుల కుటుంబాలు వీదిన పడుతున్నాయన్నారు. ట్యాంకరులోని నీరు రోడ్లపై పడటంతో రోడ్లన్ని పాడైపోవడంతో ప్రభుత్వానికి నష్టం వాటిల్లు తుందన్నారు. ప్రస్తుతం నడిచే వాటర్ ట్యాంకర్లు నిబందనలకు విరుద్ధంగా రోడ్లపై తిరుగుతూ ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్నాయన్నారు. అక్రమ నీటి దందాలపై మండల రెవెన్యూ అధికారులు దృష్టిసారించాలని, అక్రమంగా నీటిని సరఫరా చేస్తు న్న వాటర్ ట్యాంకర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని కొండల్‌రెడ్డి డిమాండ్ చేశారు.

అక్రమంగా నీటి దందా చేస్తున్న నీటి ట్యాంకర్లు

సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

సిఎంను కలిసిన ఎమ్మెల్యే

చేవెళ్ల, మార్చి 5, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గంలో చేపట్టవలసిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై వినతిపత్రం సమర్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రహదారి నిర్మాణాలు, తాగునీటి సమస్య పరిష్కారం, విద్యా మరియు వైద్య సదుపాయాల విస్తరణ వంటి అంశాలపై ముఖ్యమంత్రితో విస్తృతంగా చర్చించగా సీఎం సానుకూలంగా స్పందించినట్లు వివరించారు.

వేం నరేందర్‌రెడ్డిని అభినందించిన డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 5, ప్రభాతవార్త: రాజ్యసభ సభ్యత్వానికి కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు అభినందనలు తెలియజేశారు. గురువారం ఆయనను కలిసి ముందస్తుగా వజ్రేశ్‌యాదవ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రభుత్వ సలహాదారుగా కొనసాగిన వేం నరేందర్‌రెడ్డిని రాజ్యసభకు నామినేషన్ వేయటానికి ఎంపిక చేసి నామినేషన్ వేయించటం మంచి

పరిణామమని అన్నారు. రాజ్యసభకు ఎంపిగా ఎన్నికై తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తారన్న విశ్వాసం ఉందని వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నర్సిరెడ్డి భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



భట్టి విక్రమార్క కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

షాద్‌నగర్, మార్చి 5, ప్రభాతవార్త : ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకుమారుడి వివాహ వేడుకలో షాద్నగర్ ఎమ్మెల్యే శంకర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్ల సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షి ంచారు.

కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ సింఘ్వి నామినేషన్

నామినేషన్‌లో పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ టౌన్, మార్చి 5, ప్రభాతవార్త : కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా ఎఐసిసి అధికార ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి నామినేషన్ కార్యక్రమానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పున్నం ప్రభాకర్, షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తదితరులు హాజరయ్యారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రముఖులు నాయకులు హాజరయ్యారు. కాంగ్రెస్ అధిష్టానం వేం నరేందర్ రెడ్డి అభిషేక్ మను సాంగ్వేలను ఎంపిక చేసింది. వీరి ఎంపిక పట్ల కూడా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

అభిషేక్ సింఘ్వీ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

స్పందించిన వాటర్‌వర్క్స్ అధికారులు

-రోడ్లపై పొంగిపొర్లుతున్న మురుగు నీటి సమస్యకు పరిష్కారం

(వార్త ప్రభావం)

బేగంపేట మార్చి 5,ప్రభాతవార్త : బేగంపేట ప్రకాశం నగర్ గుండ్ల నర్సింహస్వామి దేవాలయం గల్లీ లో నెలన్నర రోజులుగా డ్రైనేజీ నీరు తీవ్ర దుర్వాసన వెదజల్లుతూ పొంగిపొర్లుతున్నా సంబంధిత శాఖాధికారులు పట్టించుకోకపోవడంపై ,,ప్రభాత వార్త,, హైదరాబాద్ మినీలో మార్చి 4వ తేదీన రోడ్లంతా మురుగు పరుగు పేరుతో కథనం ప్రచురితమైంది .కథనం పై స్పందించిన బేగంపేట తాజా మాజీ కార్పొరేటర్ మహేశ్వరి నాయకులు శ్రీహరి అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు ఆ ప్రాంతాన్ని పరిశీలించా రు.పరిస్థితిని పరిశీలించిన వాటర్‌వర్క్స్ మేనేజర్ రా మేశ్వరావు వెంటనే ఎయిర్‌టెక్ మిషిన్‌తో పాటు సిబ్బందిని రంగంలోకి దింపి వెంటనే డ్రైనేజీ నీరు బయటకు రాకుం డా చర్యలు చేపట్టారు.సమస్యను పరిష్కరించారు.ఈ సందర్భంగా అధికారులకు, తా జా మాజీ కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరిలకు స్థానిక బస్తీ వాసి బీఆర్‌ఎస్ నాయ కులు జాండ్ల కృష్ణ కృతజ్ఞతలు తెలియజేసారు.

గుండ్ల నర్సింహ స్వామి ఆలయం వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న వాటర్‌వర్క్స్ మేనేజర్ రామేశ్వరరావు,నాయకులు శ్రీహరి.

మండుటెండలు!

ఎండలు తట్టుకోలేక చల్లదనం కోసం పరుగెడదామనుకుంటే.

.. అవేమో ఎండమావులాయె... ఎలాగబ్బా

... కూర్చుందామంటే ఎక్కడా చోటులేదాయె

... ఇరుగు పరుగుల ప్రపంచంలో ప్రాణాలైనా నిలుపుకుందామంటూ

హైదరాబాద్ నడిబొడ్డున లుంబినీ పార్క్ వద్ద ఓ ముదసలి రహదారిపై పరుగులు పెడుతున్న దృశ్యం.

రైతులకు టార్పాలిన్లను అందిస్తున్న అధికారులు

మొక్కజొన్న సాగుపై రైతులకు అవగాహన

కొడంగల్,మార్చి 5,ప్రభాతవార్త: మండల పరిధిలోని రుద్రారం గ్రామ రైతువేదికలో గురువారం మొక్కజొన్నసాగుపై రైతులకుఅవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.మొక్కజొన్న పరిశోధన విభాగం,ఎఆర్ఐ రాజేంద్రనగర్,తెలంగాణా రైతు విజ్ఞాన కేంద్రం(టీఆర్‌బికె),వ్యవసాయశాఖ వారి సహకారంతో షెడ్యూల్డ్‌కులాల ఉపప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జీరో టిల్లెజ్ మొక్కజొన్న సాగుపై అవగాహన కల్పించారు.వర్షాధారంగా మొక్కజొన్న సాగు చేయాలని సూచించారు.నీటి వసతి ఉన్నవారు పత్తి తర్వాత మొక్కజొన్నను పండించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మొక్కజొన్న పరిశోధన విభాగం హెడ్ ఆర్.సుశీల,శాస్త్రవేత్తలు డి.శ్రావన్,టీ.అనుష,తెలంగానా రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు టి.రాజేశ్వర్‌రెడ్డి,మధుశేఖర్,మార్కెట్ కమిటీ చైర్మేన్ అంబయ్యగౌడ్,గ్రామ సర్పంచ్ ఎల్లప్ప,మండల వ్యవసాయ అధికారి ఎన్,శ్రీలత,వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీపతిరెడ్డి,ఇస్సాక్ హెరాల్డ్,సుమ,అశ్విని,పాటుమీదిపల్లి సంతోష్,అగ్రోస్ డీలర్ వెంకటయ్యలతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.కార్యక్రమంలో 50 మంది రైతులకు టార్పాలిన్‌లు అందించారు.

వీరశైవ సంఘం సర్పంచ్‌లకు సన్మానం

మున్సిపల్ చెర్మన్‌ను సన్మానిస్తున్న మఠాధిపతి

కొడంగల్,మార్చి 5,ప్రభాతవార్త : నియోజకవర్గంలో ఇటీవల ఎన్నికైన వీరశైవ సర్పంచ్‌లకు గురువారం మఠాధిపతులు సిద్ధిలింగ మహాస్వామి,కొడంగల్ మాజీ ఎంపిపి ముద్దప్ప దేశ్‌ముఖ్ శాలువాలు కప్పుతూ పూలమాలలతో సన్మానించారు.నిరంజన మఠంలో స్వామవారి ఆరాధనోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని పెద్దనందిగామ సర్పంచ్ అవుటి చెన్‌బస్‌కుమార్, మాటూర్ సర్పంచ్ సింగారం శివరాజ్,అల్లాపురం సర్పంచ్ అవుటి స్వరూపరాణి, బొంరాస్‌పేట్ సర్పంచ్ కొవ్వూరు వీరేశలింగం,బెజ్జారం సర్పంచ్ విద్యాసాగర్, ముక్తిపాడ్ సర్పంచ్ చంద్రశేఖర్,అమిన్‌కుంట్ల సర్పంచ్ వినోదరాజేంద్రబాబు,ఎక్కమేడ్ సర్పంచ్ రాజులకు ఘనంగా సన్మానం చేశారు.నూతనంగా ఎన్నికైన కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్,వైస్‌చెర్మన్ శంకర్‌నాయక్‌లకు మఠాధిపతులు శాలువాలు,పూలమాలలతో సన్మానించి ఆశీర్వచనాలు అందించారు.మఠాధిపతులు శ్రీసిద్దిలింగ మహాస్వామి భక్తులకు ప్రవచనాలు అందించారు.అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు రాగపురం బస్వరాజ్,రెడ్డప్పదొర,బిఆర్ విజయ్‌కుమార్,బుక్క బాలప్రకాష్,గంతల సంగప్ప,బుక్క రాజు,నాగరాజు,మఠం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్యాడ్స్,సామాగ్రిని ఉచితంగా పంపిణీ

శామీర్‌పేట, మార్చి 5, ప్రభాతవార్త: విద్యార్థుల కోసం బండి రాఘవరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ వారు రూపొందించిన కేరీర్ హ్యాండ్ బుక్‌ను మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి

ఎడ్యుకేషనల్ వారు రూపొందించిన కేరీర్ హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించిన మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్న నాయకుల,తదితరుల దృశ్యం

రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. గురువారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి నివాసంకు బండి రాఘవరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీవారు వెళ్లి విద్యార్థుల కోసం రూపొందించిన కేరీర్ హ్యాండ్ బుక్‌ను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ యువతకు విద్యా, ఉపాధి అవకాశాలపై మార్గనిర్దేశం చేసే ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించేందుకు సరైన దిశలో ముందుకు సాగేందుకు ఇలాంటి పుస్తకాలు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ గుర్క కుమార్‌యాదవ్, బిఆర్‌ఎస్ నాయకులు చీదు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బండి లక్ష్మిరాంరెడ్డి, శ్రీకర్‌రెడినడ, వంగ వెంకట్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మురళిచారి, నాగేశ్‌గౌడ్, పలువురు బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

..ఆ తరువాత శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మజీద్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి ప్యాడ్స్‌ను, సామాగ్రిని ఉచితంగా బండి రాఘవరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ వారు ఉచితంగ అందజేశారు.

రాజ్యసభకు వేంనరేంద్ రెడ్డి ఎంపిక పట్ల హర్షం

షాద్ నగర్ కాంగ్రెస్ సీనియర్ నేత తాండ్ర కాశినాథ్ రెడ్డి

షాద్‌నగర్ టౌన్, మార్చి 5, ప్రభాతవార్త : తెలంగాణ నుంచి రాజ్యసభకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేంద్ రెడ్డిని ఎంపిక చేయడం పట్ల రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత తాండ్ర కాశి నాథ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.2004లో మహబూబాబాద్ నియోజకవర్గం నుండి తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీకి ఎన్ని కయ్యారని గుర్తు చేశారు. 2024 జనవరి 20న తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారాల ప్రధాన సలహాదారుగా నియమించిందనీ, ఆయనను 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మార్చి 31న చేవెళ్ల లోక్‌సభ ఇన్‌చార్జ్‌గా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ ప్రకటించారని పార్టీకి ఎన్నో సేవలు అందిస్తూ ఓవైపు ప్రజా మన్ననలతో పాటు మరోవైపు రాష్ట్ర ప్రభుత్వానికి చేదోడు వాదోడుగా నిలుస్తూ ప్రభుత్వ సలహాదారుగా అందిస్తున్న సేవలు గుర్తించి రాజ్యసభకు పంపడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు.

వేం నరేందర్ రెడ్డిని కలిసిన తాండ్ర కాశీనాథ్ రెడ్డి

పొన్నాల్‌లో పర్యటించిన మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జామ్ రవి

శామీర్‌పేట, మార్చి 5, ప్రభాతవార్త: పొన్నాల్ గ్రామంలో మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జామ్ రవి పర్యటించారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని పొన్నాల్ గ్రామంలో నీటి సమస్యను తీర్చటానికి ఎన్నికైన కౌన్సిలర్లు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవటానికి అభివృద్ది కార్యక్రమాలను చేపట్టారు. 11,12వార్డులలో పర్యటించి సమస్యలను చైర్మన్, కౌన్సిలర్లు అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ జామ్ రవి సమక్షంలో పొన్నాల్ గ్రామం నుంచి 11, 12వ వార్డులకు ఎన్నికైన కౌన్సి లర్లు కొలాస రాజు, మేడబోయిన మౌనికశివ వీరప్రసాద్‌లు వార్డుల కార్యాలయంలో బాధ్య తలు చేపట్టారు.



నీటి సౌకర్యం కల్పించటానికి శ్రీకారం చుట్టిన మున్సిపల్ చైర్మన్ జామ్ రవి, పాల్గొన్న కౌన్సిలర్లు, నాయకులు తదితరుల దృశ్యం

వారిని చైర్మన్‌తో పాటు పలువురు నాయకులు అభినందనలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, కౌన్సిలర్లు కొలాస రాజు, మేడబోయిన మౌనికశివవీరప్రసాద్, పలు వార్డుల కౌన్సిలర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, అజయ్‌కుమార్, నాయకులు కె.భూమేశ్‌గౌడ్, రమేశ్, అజయ్‌లక్ష్మి, పాల్గొన్నారు.

చైర్మన్ ఎన్నిక పారదర్శకంగా జరగాలి

కలెక్టర్‌కు బిఆర్ఎస్ నేత వెంకటరమణారెడ్డి వినతి

ఇబ్రహీంపట్నం, మార్చి 5, ప్రభాతవార్త : ఇబ్రహీంపట్నం మున్సి పాలిటీలో ప్రజాస్వామ్యం అపహాస్యమవుతోందని..ఎన్నికల అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి మండిపడ్డారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణ రెడ్డిని కలిసి ఎన్నికల సమయంలో అధికారులు, స్థానిక ఎమ్మెల్యే నిబంధనలు ఉల్లగించారంటూ ఫిర్యాదు చేశారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్డీఓ) అనంతరెడ్డి, ఏసీపీ రాజు తమ విధులను విస్మరించి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తున్నా, తాము ఫిర్యాదులు చేసినా అధికారులు కనీస చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారులు అధికార పార్టీకి వత్తాసు పలకడం వల్లే మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ వివాదాస్పదంగా మారిందని ధ్వజమెత్తారు.గత నెల 16న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే సమక్షంలోనే కాంగ్రెస్ నాయకులు వీరంగం సృష్టించి, మైకులు, ఫర్నిచర్ ధ్వంసం చేసినా అధికారులు ప్రేక్షక పాత్ర వహించారని వెంకటరమణారెడ్డి విమర్శించారు. నిబంధనలు ఉల్లంఘించిన

ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికల్లో ఉల్లంఘనలపై జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న సత్తు వెంకటరమణారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు.

ఎమ్మెల్యేపై విచారణ జరిపి కేసు నమోదు చేయాలని, పక్షపాతంగా వ్యవహరించిన ఆర్డీఓ, ఏసీపీలను తక్షణమే విధులనుండి తప్పించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు రానున్న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను కలెక్టర్ తన ప్రత్యక్ష పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించాలని విన్నవించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పి. కృపేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మంద సురేష్, నిట్టు జగదీశ్వర్, కొప్పు జంగయ్య, వనము శ్రీనివాస్, నారగిని సుధాకర్ గౌడ్, మదుపు శివ సాయి, కాకి రవీందర్ ముదిరాజ్, నర్సిగల ప్రవీణ్, సంతోష్, మహేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కారు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు గాయాలు

-సంఘటన స్థలంను సందర్శించిన చేవెళ్ళ ఎసిపి కిషన్

చేవెళ్ల, మార్చి 5, ప్రభాతవార్త: కారు బైక్ ఢీ కొట్టిన ప్రమాదంలో ఇద్దరు ఇంటర్ విద్యార్థులకు తీవ్రగాయాలైన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం జరిగింది.చేవెళ్ల ఎస్ఐ శిరిష కథనం ప్రకారం మొయినాబాద్‌లో నివాసం ఉంటున్న కె.శివకుమార్,ఎన్.శివరాజ్‌లు ఇద్దరు స్నెహితులు చేవెళ్ల మోడల్ కాలేజీలో చదువుతున్నారు. ఇంటర్ పరిక్షలు రాసేందుకు వాళ్ల నాన్న బైక్ ఎచ్ఎఫ్ డీలక్స్ నంబర్ టిఎస్34ఎ5046పైన చేవెళ్లకు వస్తుండగా చేవెళ్లలోని ఇండియన్ పిట్రోల్ పంప్ వద్ద బ్రీజా కార్‌నంబర్ టిఎస్13ఇహెచ్0307ను ఢీ కొట్టింది.వెంగంగా కార్ వచ్చి రోడ్డుపైన వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పైన గల ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయని తెలిపారు.తీవ్రగాయలపాలైన విద్యార్థులను వెంటనే చికిత్స నిమిత్తం పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే చేవెళ్ల ఎసిపి కిషన్,సిఐ శ్రీధర్ భూపాల్‌లు మోడల్ పాఠశాలకు సంఘటన

రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థులను ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుంటున్న చేవెళ్ళ ఎసిపి కిషన్, చేవెళ్ల సిఐ శ్రీధర్ భూపాల్

స్థలంను పరిశీలించారు. పట్నం మహేందర్‌రెడ్డి అసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకుని, విద్యార్డులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శిరిష తెలిపారు.

ఉద్దెమర్రిలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణానికి భూమి పూజ

..మేడ్చల్ ఎంఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్

..పాల్గొన్న గ్రామ ముగ్గురు కౌన్సిలర్లు లతలు

శామీర్‌పేట, మార్చి 5, ప్రభాతవార్త:

ఉద్దెమర్రి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణంకు మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్ భూమి పూజ చేశారు. దీనిలో ఆయనతో పాటు గ్రామ ముగ్గురు కౌన్సిలర్లు డి.లత, పి.శ్రీలత, జి.లతలు, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ,పలువురు పాల్గొన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని ఉద్దెమర్రి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు పొట్టిగారి సుగుణమ్మ, ముక్కెర్ల కమలమ్మ, పంజాల స్వాతి, పొట్టిగారి శైలజలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవటానికి కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేయటంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసినట్లు మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.నర్సింలుయాదవ్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశలు పేర్కొన్నారు. 8వ వార్డు కౌన్సిలర్ దోసకాయల లతవెంకటేశం, 9వ వార్డు కౌన్సిలర్ శ్రీలతవెంకట్‌రెడ్డి, 21వ వార్డు కౌన్సిలర్ లతభూపాల్‌లతో పాటు 1వ వార్డు కౌన్సిలర్ పాపిరెడ్డి, 20వ వార్డు కౌన్సిలర్ బొమ్మలపల్లి

ఉద్దెమర్రిలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణంకు మంజూరు ఉండటంతో భూమి పూజ చేసి ముహూర్తం చేసిన మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, కౌన్సిలర్లు, పార్టీ అధ్యక్షులు తదితరుల దృశ్యం

మల్లేశ్‌యాదవ్, నారాయణపూర్ గ్రామ అధ్యక్షులు మహేశ్, పోతారం గ్రామ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, ఎంసిపల్లి వేణు గోపాల్‌రావు, హౌజింగ్ ఎఇ కమలాకర్, మున్సిపల్ సంబంధిత అధికారి మెహన్‌సింగ్, పలువురు పాల్గొన్నారు.

పొన్నాల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశం చేయించి లబ్దిదారులను సన్మానించి మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలు యాదవ్,పాల్గొన్న మున్సిపల్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం,నాయకులు గడ్డం రమేశ్ తదితరుల దృశ్యం

పొన్నాల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశం

..గృహప్రవేశం చేయించి లబ్దిదారులను సన్మానించిన

..మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సిలుయాదవ్

శామీర్‌పేట, మార్చి 5, ప్రభాతవార్త: పొన్నాల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం పూర్తి జరగటంతో లబ్దిదారులతో మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్ వారితో కలిసి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి గృహప్రవేశం చేయించారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని పొన్నాల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్దిదారులు రాగి స్వాతిబాల్‌రెడ్డిల ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. దీనిలో ఆయనతో పాటు మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేసుకుని గృహప్రవేశం చేసిన లబ్దిదారులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు పాపిరెడ్డి, మల్లేశ్‌యాదవ్, మున్సిపల్ సంబంధిత అధికారి దేవేందర్, గ్రామ మాజీ ఉపసర్పంచు గడ్డం రమేశ్, నాయకులు తూము వేణుగోపాల్, దామోదర్‌రెడ్డి, మహేశ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బత్తిని నర్సింగ్‌రావు, ఎరుకల యాదగిరి, కాంగ్రెస్ నాయకులు బత్తిని పాండు, రాగి మహేందర్‌రెడ్డి, తడసిన నరసింహ్మారెడ్డి, మెడబోయిన వెంకటేశ, కంఠం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సొంత ఇంటి కల ఎంతో అద్భుతం

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి

షాద్‌నగర్ రూరల్, మార్చి 5, ప్రభాతవార్త : ప్రతి మనిషి జీవితంలో సొంత ఇంటి కల ఎంతో అద్భుతం అని రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అండగా నిలబడుతూ ఇందిరమ్మ ఇంటిని నిర్మించి ఆసరా కల్పించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఫరూక్ నగర్ మండలంలోని దూసకల్‌గ్రామంలో గురువారం నిరుపేద కుటుంబానికి చెందిన జడల లలిత యాదవ్ నూతన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథి షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ తదితర స్థానిక నేతలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడల లలిత యాదవ్ కుటుంబ సభ్యులకు గృహప్రవేశం చేయించి, ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిరుపేదలకు ఇల్లు కట్టించి వారి కళ్ళలో ఆనందం చూడాలని, స్వంత ఇంటి కల నిజం చేయాలని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల గృహ

దూసకల్ గ్రామంలో జరిగిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

నిర్మాణ పథకం చేపట్టిందన్నారు. షాద్ నగర్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే, సోదరుడు వీర్లపల్లి శంకర్ ఈ పథకం విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని, రానున్న రోజుల్లో అర్హులైన ప్రతిఒక్కరికి షాద్ నగర్ నియోజక వర్గములో ఎమ్మెల్యే శంకర్‌సహకారంతో ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. నూతన గృహ ప్రవేశం చేసిన జడల లలిత యాదవ్ కుటుంబ సభ్యులకు హార్ధిక శుభాకాంక్షలు తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న నాయకులు

చేవెళ్ల, మార్చి 5, ప్రభాతవార్త: అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తామని రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబెర్ చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు దేవుని ఎర్రవల్లిలో జంగయ్య నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వార్డు ఉపాధ్యక్షుడు శివయ్య, ఏదిరే చెంద్రయ్య, బక్కయ్య, పత్తి కిష్టయ్య, జావీద్, ఏదిరే యాదయ్య, కరికే మల్లేశం, చింపుల మల్లారెడ్డి, సాకలి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ సిఐగా బాధ్యతలు చేపట్టిన సీతారాం

షాద్‌నగర్, మార్చి 5, ప్రభాతవార్త : షాద్‌నగర్ పట్టణ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా కే సీతారాం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సిఐగా ఏడాదిన్నరగా విధులు నిర్వహిస్తున్న విజయ్ కుమార్ ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ కు బదిలీ కాగా ఆయన స్థానంలో సీతారాం వచ్చారు. గురువారం సీతారం షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో విధుల్లో చేరారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.



నూతన సిఐకి స్వాగతం పలుకుతున్న పోలీసులు

విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ఆశిరెడ్డి.

నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం

మోమిన్‌పేట్.మార్చి 5,ప్రభాతవార్త: మోమిన్‌పేట్ మండల పరిధిలోని రాళ్లగుడుపల్లి మరియు లచ్చానాయక్‌తాండ ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలలో జెకెఎంఆర్ ఫౌండేషన్ తరపున నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందజేయడం జరిగిందని బిజెపి మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పాఠశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నిరుపేద విద్యార్థినులైన మేగావత్ పల్లవి, మేగావత్ సంజన, వర్య మహాలక్ష్మిలకు ఒక్కొక్కరికి 2500, రూపాయల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా భాజపా మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులకు చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చలువతో ఈ ప్రోత్సాహక నగదుబహుమతులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాళ్లగుడుపల్లి గ్రామ సర్పంచ్ వర్య మహిపాల్, లచ్చానాయక్‌తాండ సర్పంచ్ చవాన్ లక్ష్మి, ఉపసర్పంచులు చరణ్ లక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు జగదీశ్, వెంకటేశ్, నారాయణ, అంజయ్య, రాజు, సాయి, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

సర్పంచ్ గడం వెంకటయ్య

గ్రామ సభల్లో పాల్గొన్న సర్పంచ్

కుల్కచర్ల,మార్చి 5, ప్రభాతవార్త: గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ గడం వెంకటయ్య అన్నారు. గురువారం మండల పిరంపల్లి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు.ఈ గ్రామ సభలో గ్రామానికి సంబంధించిన పలుసమస్యలు, అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శకుంతల కేశవులు మాట్లాడుతూ..గ్రామ అభివృద్దే లక్ష్యంగా ప్రజలసమస్యలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. గ్రామ సభలో ప్రస్తావించిన ప్రతి అంశాన్ని పరిశీలించి, దశలవారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాంత మొగులయ్య పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ,టెక్నికల్ అసిస్టెంట్ నరేష్, ఫిల్డ్‌అసిస్టెంట్ వెంకటయ్య, మాజి సర్పంచ్ సత్యనారణ, వార్డు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో 10వ తరగతి విద్యార్దులకు మోడల్ పరీక్ష

విద్యార్దులకు మోడల్ పరీక్ష నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు

కొడంగల్,మార్చి 5,ప్రభాతవార్త: ఎస్ఎఫ్ఐ వికారాబాద్ జిల్లా కమిటీ అధ్వర్యంలో దౌల్తాబాద్ మండలం ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్దులకు గురువారం మోడల్ పరీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజుకుమార్‌గౌడ్,జిల్లా కార్యదర్శి అక్బర్ మాట్లాడుతూ ఈనెల 14 నుండి జరుగబోయే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్దులను సిద్దం చేయడానికి ,పరీక్షలపై వారు భయాందోళనకు గురికాకుండా వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఎస్ఎఫ్ఐ ప్రతి సంవత్సరం విద్యార్దులకు ఇలాంటి మోడల్ పరీక్షలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.విద్యార్దులు పోరాటాలే కాకుండా అనునిత్యం విద్యార్దుల సమస్యల పరిస్కారం కోసం పోరాడుతున్న సంఘం ఎస్ఎఫ్ఐ సంఘం కృషి చేస్తుందన్నారు .విద్యార్దులు పబ్లిక్ పరీక్షలు భయపడకుండా ఆందోళన పడకుండా పరీక్షలు రాయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కృష్ణవేని,దౌల్తాబాద్ ఒడల యూటిఎఫ్ నాయకులు సక్రీయా నాయక్,వీరందర్,దౌల్తాబాద్,గోకఫస్లబాద్ జట్పీహెచ్ఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీహరిరెడ్డి,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు సిఐగా వెంకటేశ్వర్లు

కందుకూరు, మార్చి 5, ప్రభాత వార్త: కందుకూరు సిఐగా సిహెచ్ వెంకటేశ్వర్లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కందుకూరు సిఐగా ఉన్న సీతారాం బదిలీపై షాద్నగర్ సిఐగా వెళ్లడంతో ఇక్కడకు మహేశ్వరంలో ఇప్పటివరకు బాధ్యతలు నిర్వర్తించిన హెచ్ వెంకటేశ్వర్లు సిఐగా బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రత పరీక్షల్లో ప్రజల సహకారంతో పోలీసులు ముందుకు సాగడం జరుగుతుందని ప్రజలు బాధ్యతగా వ్యవహరించి పోలీసులతో సహక రించాలని అందరూ కలిసి కందుకూరు మండలంలో శాంతి భద్రతలను కాపాడాలని సూచించారు.

బాధ్యతలు చేపడుతున్న సిఐ వెంకటేశ్వర్లు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జివికే ఇఎమ్ఆర్ఐ ద్వారా సంచార పశు వైద్య సేవలు..

షాద్‌నగర్, మార్చి 5, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మకంగ చేపడుతున్న పథకలలో ఒకటైన సంచార పశు వైద్యశాల 1962 టోల్ ఫ్రీ సేవలు మూగ జీవాలకు సేవలందించటంలో ముందంజలో ఉన్నాయని జిల్లా మేనేజర్ షేక్ జాన్ షాహిద్ తెలిపారు. జిల్లాలోని షాద్ నగర్ స్థానిక 1962 సంచార పశు వైద్యశాల వాహన సేవలను రాష్ట్ర ప్రోగ్రామ్ ఆఫీసర్ డ్రా.భగీష్ మీశ్రా సందర్శించారు, ఈ కార్యక్రమం లో డ్రా.భగీష్ మీశ్రా సేవలపట్ల ఆరా తీశారు, అంబులెన్సు లోని పనిముట్లు, మందులు ప్రజలద్వారా మూగ జీవాలకు సేవలాందించటంలో జాప్యం చేయరాదనీ, వెంటనే స్పందించి వాహనం సంఘటన స్థలానికి చేరుకొని మూగజీవలకు తగు చికిత్స చేయాలనీ తెలిపారు. ఈ సేవలను ముందంజలో నడిపించటంలో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ సహకారం ఎంతో ఉందని, ప్రభుత్వ సమన్వయంతో పనిచేయటం సంతోషంగా ఉందని తెలిపారు మరియు షాద్ నగర్ స్థానిక పశు వైద్యశాలలోని 1962 సంచార పశు వైద్యశాల వాహన సిబ్బంది డ్రా.హర్షిని , పరవేట్ గాయత్రీ, మరియు పైలెట్ శ్రీనివాస్ లను అభినందిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడిజిల్లాలు ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ షాహిద్ మరియు రంగారెడ్డి జిల్లా మేనేజర్ రాజబాబు పాల్గొన్నారు.



సంచార పశు వైద్య సేవలు ప్రారంభిస్తున్న దృశ్యం